ప్రజాశక్తి

ఆదివారం 10 నవంబర్ 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా







ప్రకాశం బ్యారేజి పున్నమి ఘాట్ వద్ద నదిలో ప్రారంభమైన సీ ప్లేన్, ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు, కేంద్ర మంతి రామ్మోహన్‌నాయుడు, ఎంపి కేశినేని శివనాథ్

సీ ప్లేన్‌కు సిఎం ఆవిష్కరణ

● విజయవాడ - శ్రీశైలం మధ్య ట్రయల్ రన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దేశంలో తొలిసారి సీ ప్లేన్ పర్యాటకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. విజయవాడ ప్రకాశం బ్యారేజి పున్నమిఘాట్ నుంచి శ్రీశైలం వరకు సిఎం చంద్రబాబు, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు దీనిలో ప్రయాణించారు. 40 నిమిషాల్లో విజయవాడ నుండి శ్రీశైలం చేరుకున్నారు. విజయవాడలో సీ ప్లేన్ డేమో లాంచింగ్ కార్యక్రమాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులతోపాటు స్థానిక ప్రజలు, నగరవాసులు వచ్చారు. విమానం నదిలో నుండి పైకి వెళ్లడాన్ని ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఆనం రామనారాయణ రెడ్డి, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులు పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. లైవ్ డ్రోన్, అధునాతన కెమెరాల ద్వారా పూర్తి కార్యక్రమాన్ని పున్నమిఘాట్ సమీపంలో ఏర్పాటు చేసిన మినీ కామాండ్ కంట్రోల్ (ఫాల్కాన్ వాహనం) ద్వారా పరిశీలించారు.



సావనీర్ ఆవిష్కరణలో ఎంఎల్‌సిలు ఐ.వెంకటేశ్వరరావు, కె.ఎస్.లక్ష్మణరావు, మాజీ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు తదితరులు

శాసనమండలిలో ప్రజా గొంతుక వినిపించాలి

● ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు ● ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ ప్రారంభం

ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు ఉపాధ్యాయ లోకం, నిరుద్యోగ యువత సంఘటితంగా ముందుకు సాగితే శాసనమండలిలో ప్రజా గొంతుక వినిపించడం ఖాయమని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. యుటిఎఫ్ కష్ణాజిల్లా స్వర్ణోత్సవ మహాసభ గన్నవరం రోటరీ ఆడిటోరియం (షేక్ సాబ్జి వేదిక)లో శనివారం ఘనంగా ప్రారంభమైంది. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.కనకారావు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో ఐ.వెంకటేశ్వరరావు ఉత్తేజపూరితమైన ప్రసంగం చేశారు. వచ్చే ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రజా గొంతుకగా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, యువతపై ఉందన్నారు. ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు శాసనమండలిలో సమరశీల పోరాటం సాగిస్తున్న ఘనత పిడిఎఫ్ ఎంఎల్‌సిలకే దక్కుతుందన్నారు.

(పూర్తి వివరాలు 5వ పేజీలో)

9 మందికి నామినేటెడ్ పదవులు

● అసంతృప్తిలో పలువురు నేతలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం శనివారం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల రెండు జాబితాలో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన 9 మందికి చోటుదక్కింది. వీరిలో టిడిపికి చెందిన వారు ఏడుగురు, జనసేన, బిజెపికి చెందిన వారు ఒక్కొక్కరు ఉన్నారు. మొత్తంగా ఎన్‌టిఆర్ జిల్లా నుండి ఐదుగురికి, కృష్ణాజిల్లా నుండి నలుగురికి నామినేటెడ్ పోస్టులు దక్కాయి. ఇప్పటికే 20 మందితో నామినేటెడ్ పోస్టుల తొలి జాబితా విడుదల చేసిన ప్రభుత్వం శనివారం మరో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో కృష్ణాజిల్లాకు సంబంధించి... రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ (గిడ్డంగుల) చైర్మన్‌గా గుడివాడ మాజీ ఎంఎల్‌ఎ రావి వెంకటేశ్వరరావు, ఏపి గౌడకార్పొరేషన్ చైర్మన్‌గా పామర్రు నియోజకవర్గానికి చెందిన వీరంకి వెంటక గురుమూర్తి, ఏపి నాటక అకాడమీ చైర్మన్‌గా గుమ్మడి గోపాలకృష్ణ నియమితులయ్యారు. అలాగే మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ముడ) చైర్మన్‌గా బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు, గన్నవరం నియోజకవర్గానికి చెందిన మట్టా ప్రసాద్ నియమితులయ్యారు. అలాగే ఎన్‌టిఆర్ జిల్లాకు సంబంధించి ఎపి స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా గొట్టుముక్కల రఘురామరాజు (విజయవాడ సెంట్రల్ – టిడిపి), ఎపి స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్‌గా సావల దేవదత్ (తిరువూరు–టిడిపి), ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోన్ రీజనల్ బోర్డు చైర్మన్‌గా రెడ్డి అప్పల నాయుడు (విజయవాడ – జనసేన), స్వచ్ఛాంధ్రప్రదేశ్ మిషన్ చైర్మన్‌గా కొమ్మారెడ్డి పట్టాభి రామ్ (విజయవాడ వెస్ట్ – టిడిపి), ఎపి ఆర్య వైశ్య వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డి. రాకేష్ (విజయవాడ వెస్ట్ – టిడిపి) నియమితులయ్యారు.

ఆశించిందొకటి...దక్కిందింకొకటి....

అనుకున్నదొకటి...అయ్యింది ఇంకొకటి అన్న చందంగా నామినేటెడ్ పోస్టుల నియామకాలు జరిగాయనే చర్చ కూటమి నేతల్లో సాగుతోంది. టిడిపి గుడివాడ ఇన్చార్జి, మాజీ ఎంఎల్‌ఎ రావి వెంకటేశ్వరరావు పార్టీ అధిష్టానం ఆదేశాలతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో అసెంబ్లీ సీటును ఎన్ఆర్ఐ వెనిగండ్ల రాముకు వదులుకున్నారు. ఎన్నికల సమయంలో పార్టీ జిల్లా (మిగతా 2లో)

గల్లీకో బెల్ట్

● నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు

● అధిక ధరలకు మద్యం విక్రయాలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

'బెల్ట్ షాపులు పెడితే సహించం.. లైసెన్స్ పొందిన దుకాణ యజమానులు నిబంధనలు పాటించాలి. బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేసే దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తాం. ఎంఆర్‌పి ధరకే మద్యం విక్రయించాలి' అని ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం చెబుతున్న మాటలన్నీ నీటి మూటలుగా మారుతున్నాయి. కృష్ణాజిల్లాలోని పలు మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులు ఏర్పాటు చేశారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అధికార పార్టీలోని కొందరు కీలక నేతలకు, పర్యవేక్షణ అధికారులకు అక్రమ అమ్మకాల్లో వాటాలపై ఒప్పందాలు కుదిరాక బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసుకోవడం, అధిక ధరలకు మద్యం విక్రయించుకోవడం పెరిగిపోయిందనే విమర్శలు వస్తున్నాయి.

మద్యం దుకాణాలు ఇలా

పామర్రు మండలంలో అధికారికంగా నాలుగు మద్యం దుకాణాలకు లైసెన్స్‌లు మంజూరయ్యాయి. వీటిలో నిబంధనలకు



విరుద్ధంగా ఆర్ అండ్ బి స్టేట్ హైవే పామర్రు–చల్లపల్లి రోడ్డులో నాగులేటి గట్టు వంతెనపక్కన ఒకటి, సినిమాహాల్ సమీపంలో ఒక దుకాణం ఏర్పాటు చేశారు. అలాగే పామర్రు బైపాస్ జాతీయ రహదారి 65 పక్కన మరోదుకాణం ఏర్పాటైంది. నాలుగు దుకాణాలకు అనుబంధంగానే మండలంలోని అన్ని గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటయ్యాయి. 2,400 మంది జనాభా ఉన్న పామర్రు మండలం కొండపర్రు గ్రామంలో మూడు బెల్ట్ షాపులు వెలిశాయి. జనాభా ఎక్కువగా ఉన్న కనుమూరులో ఐదు బెల్ట్ షాపులు ఏర్పాటు చేశారు. ఈ రెండు గ్రామాలే కాదు..మండలంలోని అడ్డాడ, కురుమద్దాల, జుజ్జవరం ఇలా ప్రతి గ్రామంలోనూ బెల్ట్ షాపులు వెలిశాయి. నియోజకవర్గ స్థాయి నాయకుడికి ముడుపులు ముట్టాకే బెల్ట్‌షాపులన్నీ ఏర్పాటయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. అలాగే పెడన (మిగతా 2లో)

దిశా నిర్దేశం లేని విఎంసి

● లోపించిన సమన్వయం ● తలో దారిలో ఎంపి, ఎంఎల్‌ఎలు

● మరోదారిలో అధికార వైసిపి ● అధికారుల్లో అయోమయం

ప్రజాశక్తి - విజయవాడ : నగర పాలక సంస్థకు దిశా నిర్దేశం లేకుండా పోయింది. ఇటు అధికారులు, అటు ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఏ పనీ ముందుకు సాగడంలేదు. అంతేగాక రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపికి చెందిన ప్రజాప్రతినిధులతోపాటు కౌన్సిల్లో అధికారంలో ఉన్న వైసిపి ప్రజాప్రతినిధులు తలోదారిలో వెళుతుండడంతో తీవ్ర గందరగోళం నెలకొంటోంది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ఎంపి, ఎంఎల్‌ఎల మధ్యే సఖ్యత లేకపోవడం కూడా విఎంసి అభివృద్ధికి ఆటంకంగా మారింది. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), నగరంలోని టిడిపి ఎంఎల్‌ఎలు బొండా ఉమా, గద్దె రామ్మోహనరావు, బిజెపి ఎంఎల్‌ఎ సుజనా



చౌదరి ఎవరిదారి వారిదే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మరోవైపు కౌన్సిల్లో అధికారంలో ఉన్న వైసిపి ప్రజాప్రతినిధులు కూడా తమ దారిలో తాము పోతున్నారు. దీంతో ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు నగరపాలక సంస్థను గాలికి వదిలేసినట్లయింది. నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, వివిధ (మిగతా 2లో)



గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు బొకే అందిస్తున్న ఎసిఎ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్

వర్సిటీల్లో క్రికెట్ గ్రౌండ్ల అభివృద్ధికి అనుమతివ్వండి

గవర్నర్‌కు ఎసిఎ అధ్యక్షులు కేశినేని వినతి

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ శనివారం కలిసి ఎసిఎ తరపున వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని పలు యూనివర్శిటీల్లో క్రికెట్ గ్రౌండ్లను అభివృద్ధి చేసేందుకు తమకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎసిఎ సెక్రటరీ సానా సతీష్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్ పాల్గొన్నారు. తమ అభ్యర్థనకు గవర్నర్ సానుకూలంగా స్పందించారని కేశినేని తెలిపారు.

నేటితో అమరావతి బాలోత్సవం రిజిస్ట్రేషన్లు ముగింపు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అమరావతి బాలోత్సవం 7వ పిల్లల పండుగ ఈనెల 15, 16, 17 తేదీల్లో జరుగుతుంది. విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాలలో జరిగే ఈ పిల్లల పండుగలో పాల్గొనేందుకు ఈనెల 10వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్‌కు 6305954249, amaravathibalostavam@g0mail.com కు వివరాలు పంపవచ్చు.

ఆటోనగర్ అభివృద్ధికి కృషి

ఐలా నేతలకు ఎంపి శివనాథ్ హామీ

ప్రజాశక్తి - విజయవాడ : ఎంఎస్ఎంఇల ద్వారా క్లస్టర్లు ఏర్పాటు చేసుకుంటే తొంభై శాతం సబ్సిడీ వచ్చే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆటోమొబైల్ అసోసియేషన్స్ క్లస్టర్లుగా ఏర్పడాలని ఎంపి కేశినేని శివనాథ్ పిలుపునిచ్చారు. గత మూడు రోజులుగా ఆటోనగర్ లోని ఆటో మొబైల్ అసోసియేషన్స్ తో సమావేశం అవుతూ వారి సమస్యలు తెలుసుకుంటున్న ఎంపి శివనాథ్ గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఆటోనగర్ ఐలా (ఇండస్ట్రీయల్ ఏరియా లోకల్ అథార్టీ) నాయకులు, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్, ది విజయవాడ టైర్ రీ ట్రేడర్స్ అండ్ వల్కనైజర్స్ వెల్ఫేర్ అసోయేషన్ నాయకులతో సమావేశం అయ్యారు. ఐలా నాయకులు జివో నెంబర్ 5, 6 లు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ జీవోల వల్ల అదనంగా పన్ను చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈసమస్యపై ఎంపి కేశినేని శివనాథ్ సానుకూలంగా స్పందించారు. ఆటోనగర్‌కి లారీలు వస్తున్న మహానాడు రహదారితో పాటు.. మరో ప్రత్యామ్నాయ మార్గం సూచిస్తే అధికారులతో మాట్లాడి ఆ రహదారిని అభివద్ధి చెప్పిస్తానన్నారు. అలాగే బిఎస్6 మోడల్ వెహికల్స్ రావటంతో పనులు తగ్గిపోయాయని. ఆ కంపెనీలతో మాట్లాడి టెక్నికల్‌గా ట్రైనింగ్ ఇప్పించాలని ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గా ప్రసాద్, సెక్రటరీ శివనాగేశ్వరరావు, డిస్పోజల్ మోటార్ మార్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గౌస్ ఖాన్, ఎఫ్ఐబి సెక్రటరీ దేవర నాగేశ్వరరావు, ది ఆటో మొబైల్ టెక్నిషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబ్దుల్ కలాం, ది విజయవాడ టైర్ రీ ట్రేడర్స్ అండ్ వల్కనైజర్స్ వెల్ఫేర్ అసోయేషన్ ప్రెసిడెంట్ ఎమ్.డి.రిజ్వాన్, సెక్రటరీ అబ్దుల్ అలీ అన్సారీ పాల్గొన్నారు.

ఐలా నేతలతో సమావేశంలో ఎంపి కేశినేని శివనాథ్



భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లపై సిపి సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : భవానీ దీక్షల సందర్భంగా టెంపుల్, పోలీస్ అధికారులతో శనివారం ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజ శేఖర బాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 11 నుండి ప్రారంభమయ్యే భవానీ దీక్షలు డిసెంబరు 25న జరిగే మహా పూర్ణాహుతితో ముగుస్తుంది. రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది దుర్గమ్మ మాలాధారణ చేసి ఇరుముళ్లను (దీక్షా విరమణ) సమర్పించుకోవడానికి విజయవాడ వచ్చి దుర్గమ్మను దర్శనం చేసుకుంటారు. ఈ సమీక్షా సమావేశంలో డిసిపిలు గౌతమి షాలి, ఎఐబిటిఎస్.ఉదయరాణి, తిరుమలేశ్వర రెడ్డి, కష్ణ మూర్తి నాయుడు, ఎస్.వి.డి.ప్రసాద్, ఆలయ ఇఒ కేఎస్ రామారావు, ఎడిసిపిలు జి.రామకష్ణ, ఏవి ఎల్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి

గల్లీకో 'బెల్ట్'

(మొదటి పేజీ తరువాయి)

మండలంలో అధికారికంగా ఆరు దుకాణాలకు లైసెన్స్ మంజూరు చేశారు. వీటికి అనుబంధంగా మండలంలోని కప్పలదొడ్డిలో ఏడు, ముంజులూరులో మూడు బెల్ట్ షాపులు ఏర్పాటయ్యాయి. ఇక్కడ ప్రతి గ్రామంలోనూ ఒకటికి మించి బెల్ట్‌షాపులను పెట్టారు. గుడ్లవల్లేరు మండలంలోని 22 గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు మెయిన్‌రోడ్డు, సంత రోడ్డులోని కూల్ డ్రింక్ దుకాణాల్లోనూ మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఈ మండలంలోని నీలకంఠపురం, డోకిపర్రుల్లో గ్రామస్తులు అభ్యంతరం చెప్పినా వినిపించకోకుండా దుకాణాలు పెట్టారు.

క్వార్టర్‌కు రూ.20 నుంచి రూ.50 అదనంగా వసూలు

చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిల్‌ను ప్రభుత్వం రూ.99కే విక్రయించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఒక్కో దుకాణానికి ఐదు కేస్‌లు ఛీప్ లిక్కర్ సరఫరా చేస్తున్నారు. అయితే దుకాణంలో ఒక్క కేసులోని బాటిళ్లు మాత్రమే దుకాణంలో విక్రయించి నో స్టాక్ అని చెబుతున్నారు. వీటిలో నాలుగు కేసులు బెల్ట్‌షాపులకు వెళ్లిపోతున్నాయి. బెల్ట్ షాపుల్లో క్వార్టర్ బాటిల్ రూ.120 నుంచి రూ.130 వరకు విక్రయిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోకన్నా ఖరీదైన ఎంసి విస్కీ, మాన్షన్‌హౌస్ క్వార్టర్ బాటిల్ రూ.220 నుంచి 180కి తగ్గింది. అయితే మధ్యస్థంగా ధరలు ఉండే క్లాసిక్ బ్లూ, హైదరాబాద్ బ్లూ తదితర క్వార్టర్ బాటిల్స్ ధరల్లో ఎటువంటి మార్పూ రాలేదు. వీటిని రూ. 150కి విక్రయిస్తున్నారు.

దిశా నిర్దేశం లేని విఎంసి

శాఖల ఉన్నతాధికారులతో ఎంపి కేశినేని శివనాథ్ గురువారం విఎంసి ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అంత వరకు బాగానే ఉన్నా...ఈ సమావేశం ఏర్పాటు చేసిన తీరుపైనే పలు విమర్శలు వినిపించాయి. నగరానికి సంబంధించిన అంశాలపై ఎంపి ఒకరే వెళ్లి అధికారులతో సమావేశం నిర్వహించడం ఏమిటనే ప్రశ్న ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల నుండే వస్తోంది. అలాగే విఎంసిలో అధికారంలో ఉన్న వైసిపికి చెందిన మేయర్, డిప్యూటీ మేయర్లు, సీనియర్ కార్పొరేటర్లకు కూడా సమావేశం గురించి సమాచారం లేదని తెలిసింది. నగరంలోని కూటమి ఎంఎల్ఎలకు కూడా సమాచారం లేదని చర్చ సాగుతోంది. నగరంలో అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో రాజకీయాలకతీతంగా అందరినీ సమావేశానికి ఆహ్వానించి సమగ్రంగా చర్చించి ఓ నిర్ణయానికి వస్తే బాగుండేదనే చర్చ సాగుతోంది. కానీ ఎవరికి వారు వ్యక్తిగతంగా విఎంసి అధికారులతో సమావేశాలు నిర్వహించి, ఏదో మొక్కుబడిగా చర్చిస్తే కలిగే ప్రయోజనం కన్నా...నష్టమే ఎక్కువ జరుగుతుందని పలువురు నగర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. అసలే అంతంతమాత్రంగా ఉన్న ఖనాజాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు రాబట్టుకునేందుకు అధికార కూటమి ప్రజాప్రతినిధులతోపాటు మేయర్, ఇతర సీనియర్ కార్పొరేటర్లను కలుపుకొని ముందుకు వెళితే కొంత వరకు మేలు జరుగుతుందనే చర్చ సాగుతోంది. అలాగే ఇంజినీరింగ్ విభాగంలో చీఫ్ ఇంజినీర్ దగ్గర నుంచి క్షేత్ర స్థాయిలో ఎఇ వరకు అందరూ విఎంసికి కొత్త వారే. వారికి ఇక్కడి భౌగోళిక పరిస్థితులు, స్థానిక పరిస్థితులను తెలుసుకునేందుకే సమయం పడుతుంది. ఈనేపథ్యంలో అటు ప్రజాప్రతినిధుల మధ్య లోపించిన సమన్వం, ఇటు అధికారుల్లో నెలకొన్న అయోమయం వెరసి విఎంసికి సరైన దిశానిర్దేశం చేసే వారు లేకుండా పోయారని చెప్పవచ్చు.

9 మందికి నామినేటెడ్ పదవులు

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షులు కొనకళ్ల నారాయణతోపాటు పలువురు కీలక నేతలు రావిని కలిసి ఒప్పించారు. పార్టీ అధికారంలోకి వస్తే ఎంఎల్‌సి పదవిని ఇస్తామని తెలిపారు. అయితే ఆయనకు వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. దీంతో రావి సంతృప్తిగా ఉన్నట్లు టిడిపిలో కొందరు చర్చించుకుంటున్నారు. ఎంఎల్‌సితో పోలిస్తే... నామినేటెడ్ పోస్టుకు అంత ప్రాధాన్యత ఉండదని ఆయన అనుచరులు వాపోతున్నారు. అలాగే జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి బండి రామకృష్ణ (ఆర్‌కె)కు నామినేటెడ్ పదవి కేటాయిస్తారని ఆయన అనుచరులు ఆశించారు. ఆయన కూడా ముడ చైర్మన్ పదవిని ఆశించారు. అయితే ఈ పదవిని బిజెపి నేతకు కేటాయించడంతో ఆర్‌కె అనుచరులు నిరాశ చెందారు. "ఆర్‌కె ఆర్మీ' వాట్సప్ గ్రూపులో తీవ్రమైన చర్చ నడిపారు. నామినేటెడ్ పోస్టుల రెండో జాబితాలోనూ చోటు దక్కకపోవడంతో ఆర్‌కెకు అన్యాయం జరిగిందనే అభిప్రాయాన్ని ఆయన అనుచరులు వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌కె సేవలను గుర్తించని జనసేన పార్టీకి తాము రాజీనామా చేస్తామని ఆయన అభిమానులు పలువురు గ్రూపులో పోస్టులు పెట్టారు. ఇంకొంత కాలం వేచి చూద్దామంటూనే రాజీనామా చేస్తామనే పోస్టులు పెట్టిన వారిని మరికొందరు ఊరడించే ప్రయత్నం చేశారు.

నామినేటెడ్ పోస్టు	పేరు	ప్రాంతం	పార్టీ
1.ఎపి గౌడ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్	వీరంకి వెంకటగురుమూర్తి	పామర్రు	టిడిపి
2.ఎపి స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ	రఘురామరాజు గొట్టిముక్కల	విజయవాడ సెంట్రల్	టిడిపి
3.ఎపి స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్	సావల దేవదత్	తిరువూరు	టిడిపి
4.ఎపి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్	రావి వెంకటేశ్వర రావు	గుడివాడ	టిడిపి
5.ఎపిఎస్ఆర్‌టిసి విజయవాడ జోన్ రీజనల్ బోర్డు చైర్మన్	రెడ్డి అప్పల నాయుడు	విజయవాడ	జనసేన
6.ఎపి నాటక అకాడమీ	గుమ్మడి గోపాల కష్ణ	పామర్రు	టిడిపి
7.స్వచ్ఛాంధ్రప్రదేశ్ మిషన్	కొమ్మారెడ్డి పట్టాభి రామ్	విజయవాడవెస్ట్	టిడిపి
8.మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ	మట్టా ప్రసాద్	మచిలీపట్నం	బిజెపి
9ఎపి ఆర్య వైశ్య వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్	డి.రాకేష్	విజయవాడ వెస్ట్	టిడిపి

శక్తి టీమ్స్ ఏర్పాటు అభినందనీయం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఆడపిల్లల రక్షణ కొరకు శక్తి టీమ్స్ ఏర్పాటు చేయడం అభినందనీయం అని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి అరుణ సారిక అన్నారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ సారిక మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో నివసించే మహిళలు, ఆడపిల్లల రక్షణ కొరకు శక్తి టీమ్స్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈవ్ టీజింగ్ అరికట్టడానికి ఇలాంటి శక్తి టీమ్ యొక్క అవసరం ఎంతైనా ఉందన్నారు. టీమ్స్ ఏర్పాటుకు జిల్లా ఎస్పీ కృషి ప్రశంసనీయం అన్నారు. జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల రక్షణ, వారి భద్రతే మా ప్రధాన ధ్యేయం అన్నారు. నేడు సమాజంలో మహిళలు, విద్యార్థినులు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ మరియు ఇతర నేరాలు నుంచి రక్షణ కల్పించి వారికి సత్వర న్యాయం అందించేందుకు, ఈ టీమ్స్ ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు.ప్రతి శక్తి టీమ్ మహిళా పోలీస్ సిబ్బంది కళాశాలలు, పాఠశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషను మరియు పబ్లిక్ ప్లేసెస్ లో గస్తీ తిరుగుతూ ఉంటారని, 112 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ఏదైనా ఫిర్యాదు అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని అవసరమైన చర్యలు చేపడతారన్నారు. కేవలం రక్షణ చర్యలకే పరిమితం కాకుండా కళాశాలలు, పాఠశాలలలో బాలికలకు చట్టాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. 20 వాహనాలతో 40 మంది మహిళా పోలీసు సిబ్బందితో ప్రత్యేకంగా ఈ శక్తి టీమ్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ శక్తి టీమ్ కొరకు ప్రత్యేకంగా నియమించబడిన సిబ్బంది మహిళా భద్రత కొరకు తమ వంతు కృషి చేయాలని, అన్నీ సందర్భాలలోనూ చురుకుగా వ్యవహరిస్తూ తమ పనికి న్యాయం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి. సత్యనారాయణ, బందరు డిఎస్పి ఎండి. అబ్దుల్ సుభాన్ , ఏఆర్ డిఎస్పి వేంకటేశ్వర రావు , సర్కిల్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న నాయకులు, రైతులు

రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మెయిన్ కాలువకు నీళ్లు ఇచ్చి దాళ్వాకు వరి సాగు అనుమతి ప్రభుత్వ వెంటనే ఇవ్వాలని కోరుతూ బంటుమిల్లి లక్ష్మీపురం సెంటర్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, అఖిలపక్ష రైతు సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. బంటుమిల్లి, కత్తివెన్ను మండలాల్లో పలు గ్రామాల నుండి 41 మంది రైతులు ఈ దీక్షలో పాల్గొన్నారు. సుజ్ఞానం మహేష్ , వీరంకి కుమారస్వామి శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండలం రైతు సంఘం అధ్యక్ష , కార్యదర్శులు మలిశెట్టి శివరాం ప్రసాద్, లంకదాసుల అజయ్ ఘోష్ ,సిఐటియు నాయకులు మాజేటి శ్రీనివాసరావు మరియు రైతు నాయకులు, రైతులు వెంట్రపాటి సురేష్, బండారు చంటి, ప్రత్తి సూర్యచంద్రరావు, తిరుమల చంటి , పిన్నెంటి బోసు ,మారు బోయిన ఆంజనేయులు ,పుప్పాల పాండు రంగారావు నీలిపూడి సర్పంచ్ అమ్మిశెట్టి సతీష్, జెన్యావుల కన్నారావు ,మల్లా ఆంజనేయులు, పాశం ఆంజనేయులు, రాయపురెడ్డి జేజి బాబు పాల్గొన్నారు.

గ్రహణ మొర్రి, అంగిలి చీలిక ఆపరేషన్లు విజయవంతం



ప్రజాశక్తి-గన్నవరం : గ్రహణం మొర్రితో ఇబ్బంది పడుతున్న వారిలో పెదవులపై చిరునవ్వులు లక్ష్యంగా పని చేస్తున్నట్లు చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు, సిద్ధార్థ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ. రామోజీరావు, ఓరల్ సర్జరీ హెచ్ ఓ డీ. ఎన్.కోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం డెంటల్ కళాశాలలో స్మైల్ ట్రాయిన్ ఇండియా, ఏపీ ప్రభుత్వ సంయుక్త సహకారంతో 300 మందికి గ్రహణం మొర్రి, అంగిలి చీలిక ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంగిలి చీలిక, గ్రహణంమొర్రితో ఇబ్బందులు పడుతున్న రోగులకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. పుట్టిన బిడ్డ నుండి ఏ వయస్సు వారికైనా ఈ ఆపరేషన్లు చేస్తారన్నారు. సిద్ధార్థ అకాడమి ఈ ఆపరేషన్లకు పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రోగులు వినియోగించుకోవాలని చెప్పారు. తమ కళాశాలలో పూర్తి వసతులు ఉన్నట్లు పేర్కొన్నారు. లక్షల రూపాయలు ఖర్చు అయ్యే ఈ ఆపరేషన్లకు ఖర్చు లేకుండా చేస్తున్నామన్నారు. ఆర్థోడాంటిక్స్ సహకారంతో క్లిప్లను సైతం తామే అందజేస్తున్నట్లు, చిన్నారుల్లో సర్జరీకి ముందు పోషకాహారం అందించేందుకు న్యూట్రీషనల్ సపోర్టు కూడా ప్రభుత్వం, స్మైల్ ట్రైన్ ఇండియా అందజేస్తున్నాయని వివరించారు. పుట్టిన బిడ్డకు ఆపరేషన్ చేయటంతో పాటు వారికి దశల వారీగా అవసరం మేరకు 18సంవత్సరాల వరకూ ఉచితంగా వైద్యాన్ని డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ డెంటల్ కళాశాల అందజేస్తుందన్నారు. ఏవో వై. మధుసూదనరావు, సర్జన్ డాక్టర్ గుంటూరు శ్రీకాంత్, ఆర్థోడాంటిక్స్ హెచ్ఓడి డా. కిరణ్, డా. రవిచంద్రశేఖర్, డాక్టర్ మదుల పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రధానమంత్రి మాత సంరక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సభ్యులు చాపరాల రాజేశ్వరరావు ఆర్థిక వితరణతో 80 మంది గర్భిణీలకు ఐరన్ టానిక్ మందులు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం వైద్యాధికారి గోపాల్ నాయక్ , సిబ్బంది, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ, లయన్స్ క్లబ్ జిల్లా మాజీగవర్నర్ వైపీసీ ప్రసాద్, లయన్స్ సభ్యులు మోహనరావు, సుబ్బారావు, వెంకట్రావు, రాధాకృష్ణ, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : జిల్లాలోని మహిళలు ప్రభుత్వ సహాయంతో పొరుగు వ్యాపార ఆడిట్ విభాగాలను(నైబర్హుడ్ బిజినెస్ యూనిట్ లు) ఏర్పాటు చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్వయం సహాయక సంఘాల మహిళలకు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని జిల్లా పరిషత్ మీటింగ్ సమావేశం మందిరంలో రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు పొరుగు వ్యాపార విభాగాల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రత్యేకంగా పొరుగు వ్యాపార విభాగాలను (నైబర్హుడ్ బిజినెస్ యూనిట్లు) నెలకొల్పుటకు ప్రోత్సాహం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా సంకల్పించిం దన్నారు. ఇందులో భాగంగా కృష్ణాజిల్లాను ప్రయోగాత్మ కంగా తీసుకొని ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో ఆసక్తి ఉన్న 196 మంది మహిళా సభ్యులను గుర్తించి శిక్షణ తీసుకుంటున్నా రన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను, సౌకర్యాలను అందిపుచ్చు కొని మహిళలు తమ ఇరుగుపొరుగులోనే ఆడిట్ వ్యాపారాలు చేయుటకు దృఢ సంకల్పంతో ముందడుగు వేయాలన్నారు. తద్వారా వారు అంచలంచలుగా ఎదిగి ఆర్థిక అభివద్ధి సాధించగలరన్నారు. సానుకూల దక్పథంతో ఆలోచిస్తే ఏమైనా సాధించవచ్చున్నారు. రాష్ట్ర సేర్ఫ్ డైరెక్టర్ పద్మావతి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో చదువుకొని నిరుద్యోగులుగా ఉన్న మహిళలను డ్వాక్రా తరహాలో సంఘాలుగా ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా అభివద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నైబర్హుడ్ బిజినెస్ యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిం దన్నారు. ఆసక్తిగల యువత, మహిళల జాబితా సేకరించి వివిధ శాఖలు, ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలలో అనుసంధానించి పర్యవేక్షణ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించా మన్నారు. ఆడిట్ నైబర్హుడ్ బిజినెస్ యూనిట్ల సభ్యులకు కనీసం మూడు సంవత్సరాలు ఆపైన సంఘంలో సభ్యులుగా ఉండాలని, డిఫాల్ట్ గా ఉండరాదని, అకౌంట్స్, కామర్స్ చదివి ఉండాలని, ఆడిట్ సి ఆర్ పి గా అనుభవం కలిగి 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ఫ్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ బి శ్రీనివాస్, డి ఆర్ డి ఐ ఇన్చార్జి పిడి అరుణ, మచిలీపట్నం ఆర్డిఓ కే స్వాతి, డి పి ఎం ఐబి సత్యభామ పలువురు స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.



ఇండస్ట్రియల్ హబ్‌గా మచిలీపట్నం : మంత్రి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం నియోజకవర్గానికి ఇండస్ట్రియల్ హబ్ గా తీర్చి దిద్దడమే తన ముందున్న లక్ష్యం అని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.శనివారం నగరంలోని జడ్పీ కన్వెన్షన్ హాల్లో సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఏర్పాటుపై జిల్లాలోని యువ పారిశ్రామిక వేత్తలకు నిర్వహించిన కార్యశాలలో మంత్రి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ విధమైన కార్యక్రమం నిర్వహించటం రాష్ట్రంలోనే మొదటిదని పేర్కొన్నారు. రానున్న కాలంలో బందరు పట్టణానికి మంచి రోజులు రానున్నాయని, డిసెంబర్ 2025 నాటికి మచిలీపట్నం పోర్టు నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తా మన్నారు. త్వరలో మచిలీపట్నం నియోజకవర్గంలో ఇండస్ట్రి యల్ పార్క్ ను ఏర్పాటు చేస్తామని, సంవత్సరానికి కనీసంగా 50 పరిశ్రమలు ఏర్పాటు చేసే దిశగా అడుగులు ముందుకు వేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఆర్. వెంకట్రావు, ఏపీ ఎంఎస్ఎంఈడిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఎంఎస్ఎంఈ ఫ్యాకల్టీ మెంబర్ వి స్వప్న, రిలేషన్షిప్ మేనేజర్ ఇమాని అభయ్‌కృష్ణ పాల్గొన్నారు.


రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి- కోడూరు : కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం శివారు అంబటి బ్రాహ్మణయ్య వారధి వద్ద అక్రమంగా తరలిస్తున్న మూడు వేల కేజీల రేషన్ బియ్యాన్ని కోడూరు పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కోడూరు ఎస్సై చాణిక్య మాట్లాడుతూ మచిలీపట్నం వైపు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని సమాచారం రావడంతో స్టేషన్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు చేస్తుండగా రేషన్ బియ్యాన్ని తరలిసుత్ను కోడూరు గ్రామం 9వ వార్డుకు చెందిన బత్తుల రాజును అరెస్టు చేసి అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్సై తెలియజేశారు. వీరి వెంట వీఆర్వో గోపాలకృష్ణ, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-నాగాయలంక : నాగాయలంక మండలం పర్ర చివర గ్రామ శివారు దుర్గాప్రసాద్‌పురంలో జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మెండు నాగమల్లేశ్వరరావు కుటుంబం కట్టుబట్టలతో మిగలగా మానవత దృక్పథంతో ఆ కుటుంబానికి అవనిగడ్డ మండల ప్రధాన కార్యదర్శి బచ్చు శ్రీహరి 5000 రూపాయల విలువైన దుస్తులు, దుప్పట్లు, పండ్లు, బియ్యం శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగం కార్యదర్శి లంకె యుగంధర్, బండ్రెడ్డి మల్లికార్జున్, మండల పార్టీ ఉపాధ్యక్షులు బోనం పాపారావు పాల్గొన్నారు.

పాపారావు నియామకంపట్ల హర్షం



ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆంధ్రప్రదేశ్ సర్వం చుల సంక్షేమ సంఘం, జనసేన బీసీ సంఘం నాయకులు చిలకల పూడి పాపారావుకు రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించడం పట్ల అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ శుభాకాంక్షలు తెలి పారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో పాపారావుకు ఈ పదవి లభించడం హర్షదాయకం అన్నారు. ఈ సందర్భంగా పాపారావుకు ఫోన్ చేసి అభినందనలు తెలిపినట్లు బుద్ధ ప్రసాద్ చెప్పారు. కాగా పాపారావు ఎన్నికలలో జనసేన పార్టీ తరపున విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. దీనితో ఆయనకు ఈ పదవి లభించడంతో బీసీలకు ముఖ్యంగా మత్స్యకార వర్గాలకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించినట్లు అయిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఆదర్శనేత డేవిడ్

వర్థంతి సభలో నేతలు

ప్రజాశక్తి - విజయవాడ : కార్మికుల సమస్యలపై అహర్నిశలు శ్రమిస్తూ, యూనియన్ అభివృద్ధికి తనజీవితాన్ని త్యాగం చేసిన ఆదర్శ నాయకులు, ఎపి మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగర ప్రధాన కార్యదర్శి మన్నం డేవిడ్ ప్రథమ వర్ధంతి సభ పూర్ణానందంపేటలోని విఎంసి వెహికల్ డిపోలో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ముందుగా డేవిడ్‌తో పాటు మునిసిపల్ యూనియన్ అభివృద్ధికి కృషి చేసిన ఎం.జమలయ్య, గుర్రం వెంకటేశ్వర్లు, సాదర బోయిన పెద సుబ్బారావు, కగ్గ తిరుపతయ్య, కలవకొల్లు నరసింహులు తదితర నాయకుల చిత్రపటాలకు సిఐటియు రాష్ట్ర నాయకులు చిగురుపాటి బాబూరావు, తదితరులు నివాళ లర్పించారు. వెహికల్ డిపో వద్ద సిఐటియు జెండాను కాశీనాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దనకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కార్యక్రమానుద్దేశించి బాబూరావు మాట్లాడుతూ మునిసిపల్ రంగంలో ఆప్కాస్ విధానాన్ని తీసుకొచ్చి కార్మికుల శ్రమను దోచుకుంటూ ఉద్యోగాలకు భద్రత లేకుండా చేస్తూ కార్మికుల జీవితాలతో ఈ నాటి ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి విధానానికి వ్యతిరేకంగా, ఉద్యోగ భద్రత -పర్మినెంట్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం చివరి వరకు పోరాడిన యూనియన్ నాయకులు డేవిడ్, ఇతర నాయకుల స్ఫూర్తితో కార్మికుల సమస్యలను పరిష్కరించు కోవడంతో పాటు యూనియన్ బలోపేతానికి కార్మికులం దరూ మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 11న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ప్రజా చైతన్య సభకు సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరవుతున్నారని, కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు చేస్తున్న పోరాటాలకు సిఐటియు వెన్నుదన్నుగా నిలుస్తుందని అన్నారు. సిఐటియు సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె దుర్గారావు, ఎంవి సుధాకర్, మునిసిపల్ యూనియన్ అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి ప్రవీణ్, కోశాధికారి స్టీఫెన్‌బాబు, వెహికల్ డిపో జనరల్ సెక్రటరీ జలసూత్రం నాగరాజు, అధ్యక్షులు కొండా హరిబాబు, నాయకులు టి తిరుపతమ్మ పాల్గొన్నారు.


డేవిడ్ వర్థంతి కార్యక్రమంలో బాబూరావు, కాశీనాథ్, ఎన్‌సిహెచ్, తదితరులు


మామిడికాయలు పరిశీలిస్తున్న ఎంపి చిన్ని

మామిడి రైతుల అభివృద్ధికి సహకారం :ఎంపి

ప్రజాశక్తి - విజయవాడ : రైతు ఉత్పత్తి దారుల సంఘం సభ్యుల అభివృద్ధికి ఎప్పుడు అండగా వుంటానని ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. గన్నవరం నుంచి మామిడి కాయలు విదేశాలకు ఎగుమతి చేసే విధంగా కేంద్ర పౌరవిమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తో మాట్లాడతానని చెప్పారు. ఎయిర్ కార్గో లో ఎగుమతి చేసేందుకు కావాల్సిన దిగుబడి పెంచాలని సూచించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ శనివారం మైలవరం నియోజకవర్గం రెడ్డి గూడెం మండలానికి చెందిన ఎఫ్.పి.సి సభ్యులు ఎంపి కేశినేని శివనాథ్ ను కలిసి నాణ్యత గల మామిడికాయలు పండించేందుకు ఫ్రూట్స్ కవర్స్, ప్లాస్టిక్ ట్రేలు, దాపోలీ హార్వెస్టర్లు లకు ప్రభుత్వం తరుపున సబ్సీ డీ ఇప్పించాలని రెడ్డి గూడెం రైతు ఉత్పత్తి దారుల సంఘం (ఎఫ్.పి.సి) సభ్యులు ఎంపి కేశినేని శివనాథ్ కోరారు. తాము పండించిన మామిడికాయలు ఎంపి కేశినేని శివనాథ్ కి చూపించి వాటి నాణ్యత, పండించే విధానం వివరించారు. రెడ్డిగూడెంలో ఆగిపోయిన ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్ ను త్వరగా ప్రారంభించేందుకు కృషి చేయాలని ఎఫ్.పి.సి సభ్యులు ఎంపి కేశినేని శివనాథ్ ను కోరారు. రైతుల సమస్యలపై ఎంపి కేశినేని శివనాథ్ సానుకూలంగా స్పందిం చారు. ఎఫ్.పి. సి డైరెక్టర్స్ చేట్రోలు కపారాజు, కొండపల్లి పరమేశ్వరరావు, ఎఫ్.పి. సి సభ్యులు పాల్గొన్నారు.

'ఆయుష్'లో వాక్సినేషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : నగరంలోని ఆయుష్ హాస్పిటల్‌లో వాక్సినేషన్ సెంటర్ శనివారం ప్రారంభమైంది. విజయవాడ తూర్పు నియోజక వర్గ శాసన సభ్యులు గద్దె రామమోహన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయుష్ హాస్పిటల్ వారు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వాక్సినేషన్ సెంటర్ ఏర్పాటు చేశారని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలి అని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలని దష్టిలో ఉంచుకొని వయసుని బట్టి వ్యాధులు రాకుం డా ఉండటానికి ముఖ్యంగా పుట్టబోయే శిశువు భద్రత కోసం గర్భిణీ స్త్రీలకు టీకాలు అవసరమని అన్నారు. ఈ సందర్భంగా ఆయుష్ హాస్పిటల్ వైద్య బృందాన్ని అభినందించారు. హాస్పిటల్ మేనేజింగ్ చైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు మాట్లాడుతూ ఇప్పటివరకు చిన్న పిల్లలకు వ్యాక్సిన్ అనే వరకే అయితే పలు రకాలైన వ్యాధులు రాకుండా పెద్ద వారు కూడా వ్యాక్సిన్ వేయించుకోవాలని అన్నారు. టిడిఏపి, వెరిసెల్లా ఎంఎంఆర్, హెపటైటిస్, టైఫాయిడ్, నిమోనియా వాటి వ్యాక్సిన్‌లు. పెద్ద వారు కూడా వేయించుకొని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.గోపాలకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వ్యాక్సినేషన్ సెంటర్ ప్రారంభించిన ఎంఎల్‌ఎ గద్దె

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈ నెల 11న జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించనున్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల వివరాలను ప్రకటించారు. స్కూల్ విభాగంలో ఎన్‌టిఆర్ జిల్లాకు సంబంధించి గార్లపాటి చంద్రశేఖర్ స్కూల్ అసిస్టెంట్, జగ్గయ్యపేట బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కె.నెహ్రూ, సెకండరీ గ్రేడ్ టీచర్, జక్కంపూడి ఎంపిపి పాఠశాల ఎంపికయ్యారు. కృష్ణా జిల్లాకు సంబంధించి జి.వెంకట రమణ , స్కూల్ అసిస్టెంట్ ఉయ్యూరు జిల్లా పరిషత్ పాఠశాల , రాయన శివరామ ప్రసాద్ పామర్రు మున్సిపల్ స్కూల్ ఎంపికయ్యారు. ఇంటర్ విభాగంలో సరళ కుమారి మైలవరం ప్రభుత్వ కళాశాల, కె.ఎ.వి.ఎస్.ప్రసాద్ శాస్త్రి నో మొవ్వ ప్రభుత్వ కళాశాల ఎంపికయ్యారు. ఎం.విజయ సారథి టెక్నికల్ ఎడ్యుకేషన్‌కి సంబంధించి ఎన్‌టిఆర్ జిల్లా నుండి ఎంపికయ్యారు. ఎలీషా దేవ సహాయం గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుండి ఎంపికయ్యారు.

మాకినేని బసవపున్నయ్య స్టేడియం మరమ్మతులు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : బుడమేరు వరదల కారణంగా దెబ్బతిన్న స్టేడియంను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో పాటు ఇండోర్ షటిల్ కోర్టును ఆధునీకరించాలని కోరుతూ డివైఎఫ్ఐ, స్పోర్ట్స్ కమిటీ, వాకర్స్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్టేడియంలో ధర్నా నిర్వహించారు. స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ క్రీడాకారులు, డివైఎఫ్ఐ, స్పోర్ట్స్, వాకర్స్ నాయకులు, సభ్యులు నినాదాలు చేశారు. కార్యక్రమానుద్దేశించి డివైఎఫ్ఐ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎన్.కె.నిజాముద్దీన్ మాట్లాడుతూ బుడమేరు వరదలకు స్టేడియం పూర్తిగా దెబ్బతిందని, అయినా సంబంధిత అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. పలు రూపాల్లో అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. గుంటలను పూర్తిగా పూడ్చివేసి లెవెలింగ్ చేయాలని డిమాండ్ చేశారు. తాగునీరు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఓపెన్ షటిల్ కోర్టు, వాలీబాల్ కోర్టులు మరమ్మతులు చేయించాలని కోరారు. విజయవాడ ఎంపి క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు నిత్యం మాట్లాడటమే తప్పా...ఎంబి స్టేడియం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కమిటీ నాయకులు ఎస్.కె పీరు సాహెబ్, డి వై యఫ్ ఐ ఉపాధ్యక్షులు రవి, నాయకులు మహేష్, యశ్వంత్, వాకర్స్ అసోసియేషన్ నాయకులు చంద్రరావు, బాలాజీ, క్రీడాకారులు వాకర్స్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు, స్పోర్ట్స్ కమిటీ, వాకర్స్ కమిటీ సభ్యులు, తదితరులు

గ్రామాల్లో బెల్ట్ షాపుల జోరు

ప్రజాశక్తి - గంపలగూడెం : ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన మద్యం పాలసీ తీరు మారింది. ప్రభుత్వ పెద్దలు చెప్పే మాటలకు ఇక్కడ జరుగుతున్న పరిస్థితులకు విరుద్ధంగా కనిపిస్తోంది. మండల వ్యాప్తంగా నాలుగు దుకాణాలు మంజూరు కాగా, ఒకటి గంపలగూడెం, 2 తోట మూల, మూడు, నాలుగు ఊటుకూరు గ్రామంలో ఏర్పాటయ్యాయి. ప్రారంభం నుండి విచ్చలవిడిగా బెల్ట్ షాపులు పుట్టుకొచ్చాయి. అయినా సదరు శాఖ అధికారులు అవేమీ కనబడనట్టు తప్పించుకుపోతున్నారు. మండలంలోని ఒక్క వినగడప చెరువు కట్ట పైనే నాలుగు నుండి ఐదు బెల్ట్ షాపులు సందడి చేస్తూ, పండుగ వాతావరణం తలపిస్తోంది. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లోనూ ఒకటి నుండి రెండు బెల్ట్ షాపులు జోరుగా కొనసాగుతున్నాయనడం అతిశయోక్తి కాదు. మద్యం దుకాణాల సమీపాన మద్యం వినియోగదారులు కొని అక్కడే తాగే అవకాశానికి ఈ ప్రభుత్వం చెక్ పెట్టింది. కానీ ఇక్కడ దుకాణ యజమానులు అదేదో లైసెన్స్ తెచ్చుకున్నట్లు బార్ అండ్ రెస్టారెంట్లు కొనసాగిస్తున్నారు. ఈ విధానంతో ఆ షాపుల చుట్టుపక్కల ఉన్న గృహాల్లో సైతం ఉండలేని పరిస్థితులు నెలకొంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్కడే తాగి ఉమ్ము వేసి మూత్ర విసర్జన చేస్తున్నారని ఇదంతా తెలిసిన అధికారులు ఎరగనట్లు ఉన్నారు. ఇటువంటి విషయాలు పరిశీలిస్తే, ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే చేతలకు పొంతనలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు సదరు పరిస్థితులను పరిశీలించి కట్టడి చేయాలని కోరుతున్నారు.

కార్పొరేషన్ చైర్మన్‌గా దూండీ రాకేష్

ప్రజాశక్తి- నందిగామ : ఎపి ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నందిగామకు చెందిన డూండీ రాకేష్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండవ విడత నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లో భాగంగా రాకేష్ కు ఈ పదవి దక్కింది. వివిధ కార్పొరేషన్ లో చైర్మన్ లను ప్రకటించే ప్రక్రియలో లిస్ట్‌లో రాకేష్ పేరు ఉంది. ఈ లిస్టును అధికారికంగా ప్రకటించవలసి ఉంది.

బైరాకు అభినందనలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ గా భైరా రామకోటేశ్వరరావు ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కార్యాలయంలో ఆయన జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసి క్యూషన్స్ వి.రాజేంద్రప్రసాద్, ఎం.విజయ, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లాం ఆజోయ్ ప్రేమకుమార్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా భైరా రామకోటేశ్వరరావు మాట్లాడారు. ప్రాసిక్యూటర్లందరూ బాధితులకు న్యాయం జరిగేలా పనిచేయాలని, నిందితులకు కఠిన శిక్షలు పడేలా ప్రాసిక్యూటర్ వ్యవస్థను పటిష్ట పరచాలని తెలిపారు. ప్రతి నెలా సమీక్షా సమావేశాలు నిర్వహించడం ద్వారా కొత్త చట్టాల (బిఎన్ఎస్) పట్ల అవగాహన పెంచుకొని పోలీసులతో సమన్వయపరుచు కొంటూ బాధితులకు న్యాయం జరిగేలా నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా ప్రాసిక్యూటర్లందరూ వ్యవహరించాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన భైరా రామకోటేశ్వరరావును అభినందించారు.

ఎంఎస్ఎంఇలు ఆర్థిక వృద్ధికి చోదక శక్తులు

యుబిఐ చీఫ్ జిఎం చందర్ మోహన్ మినోచా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక యూనిట్లు (ఎంఎస్ఎంఈ) దేశ ఆర్థిక వృద్ధి చోదకశక్తులని, వీటి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనందిస్తున్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని యూబీఐ చీఫ్ జీఎం (ముంబై) చందర్ మోహన్ మినోచా అన్నారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ ఎంఎస్ఎంఈ క్లస్టర్ అవుట్‌రీచ్ కార్యక్రమం కింద ఏపీ ఎస్ఎల్‌బిసి కన్వీనర్ భాస్కరరావు ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం శనివారం నగరంలోని ఐలాపురం కన్వెన్షన్ సెంటర్లో బంగారు ఆభరణాల క్లస్టర్ వ్యవస్థాపకుల సమావేశం నిర్వహించారు. వ్యాపారులు, తయారీదారులతో పాటు ఆభరణాల వ్యాపారవేత్తలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్ఆర్ విభాగ చీఫ్ జనరల్ మేనేజర్ (ముంబై) మాట్లాడుతూ బ్యాంకుల అనుసంధానంతో వివిధ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. వివిధ బ్యాంకుల పథకాలతో పాటు ఎంఎస్ఎంఇ యూనిట్ల వృద్ధి, అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపి పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ ఎ.సుధాకర్, బంగారు ఆభరణాల వర్తక సంఘం ప్రతినిధిగా శ్రీ విశ్వకర్మ గోల్డ్‌స్మిత్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ డి.శ్రీనివాసరావు, యూబీఐ రీజనల్ హెడ్ ఎం.శ్రీధర్, డిప్యూటీ రీజనల్ హెడ్ హరీష్ బేతా, జిల్లా ఎల్‌డిఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దేశంలోని దాదాపు 195 కేంద్రాలకు చెందిన ఎంఎస్ఎంఈ వ్యవస్థాపకులతో వర్చువల్‌గా సంభాషించగా అతిథులు వీక్షించారు.



ప్రసంగిస్తున్న యుబిఐ చీఫ్ జి.ఎం. చందర్ మోహన్ మినోచా

శాసనమండలిలో ప్రజా గొంతుక వినిపించాలి

- పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు
- ఘనంగా యుటిఎఫ్ కృష్ణాజిల్లా స్వర్ణోత్సవ మహాసభ ప్రారంభం


మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - గన్నవరం : ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకు నేందుకు ఉపాధ్యాయ లోకం, నిరుద్యోగ యువత సంఘటితంగా ముందుకు సాగితే శాసనమండలిలో ప్రజా గొంతుక వినిపించడం ఖాయమని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. యుటిఎఫ్ కృష్ణాజిల్లా స్వర్ణోత్సవ మహాసభ గన్నవరం రోటరీ ఆడిటోరియం (షేక్ సాబ్జి వేదిక)లో శనివారం ఘనంగా ప్రారంభమైంది. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.కనకారావు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో ఐ.వెంకటేశ్వరరావు ఉత్తేజపూరితమైన ప్రసంగం చేశారు. వచ్చే ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రజా గొంతుకగా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి కె.ఎస్. లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, యువతపై ఉందన్నారు. దీనిలో యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యా రంగం మనుగడకు ఉపాధ్యాయులు ఐక్యంగా సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. ప్రస్తుతం విద్య వ్యవస్థ, చట్టాలు, విధివిధానాల గురించి తెలియని వారు మంత్రులుగా, అధికారులుగా ఉన్నారని పేర్కొన్నారు. గన్నవరం ఉద్యమాలకు పురిటి గడ్డని, ఇక్కడ ఉపాధ్యాయ ఉద్యమాలూ ఉధృతంగా సాగాయని గుర్తుచేశారు. ప్రజా నేతలు పుచ్చలపల్లి సుందరయ్య, అట్లూరి శ్రీమన్నారాయణ స్ఫూర్తితో నాటి నుంచి నేటి వరకు ప్రజా పోరాటాలు సాగుతూనే ఉన్నాయన్నారు. అటువంటి పోరాటాల పురిటి గడ్డపై యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ జరుపుకోవడం గర్వకారణమన్నారు. 50 ఏళ్లు ఎగిసిన పిడికెళ్ల నుంచి పుట్టిన సంఘం యుటిఎఫ్ అన్నారు. చారిత్రక అవసరం నుంచి పుట్టిన సంఘంలో పని చేయడం మన అదష్టంగా భావించాలన్నారు.

నూతన విద్యా విధానాలను వ్యతిరేకించాలి
పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యావిధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. దీనిలో ప్రజలను కూడా భాగస్వాములు చేసేందుకు యుటిఎఫ్ కీలక భూమిక పోషించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు శాసనమండలిలో సమరశీల పోరాటం సాగిస్తున్న ఘనత పిడిఎఫ్ ఎంఎల్‌సిలకే దక్కుతుందన్నారు. ఉపాధ్యాయులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కషి చేస్తామన్నారు.

ప్రభుత్వ రంగాల పరిరక్షణకు పోరాడాలి
సిఐటియు జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి వై.నరసింహారావు



సిఐటియు జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి వై. నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారానికి పోరాడడంలో యుటిఎఫ్ కీలకభూమిక పోషిస్తోందన్నారు. అందుకే రాష్ట్రంలో పోరాటపటిమ కలిగిన సంఘంగా గుర్తింపు పొందిందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులతోపాటు కార్మికులపైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

ఉద్యమాల పురిటి గడ్డ గన్నవరం
గన్నె వెంకట్రావు, ఆర్థిక విశ్లేషకులు



ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు గన్నవరం చరిత్రను గుర్తుచేశారు. విమానాశ్రయం ఏర్పాటు సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధంగా పని చేయాలని చెప్పి రైతులపై ఒత్తిడి చేసిందని, దీనికి వ్యతిరేకంగా ఎడ్లబండ్లను రోడ్లపై నిలిపివేసి రైతులు పోరాటం సాగించారని తెలిపారు. దీంతో బ్రిటిష్ అధికారులు దిగివచ్చి రైతులకు న్యాయబద్ధమైన పరిహారమిచ్చి పని చేయించుకున్నారని తెలిపారు. ఈ పోరాటంలో అమరజీవి చింతపల్లి పాపారావు కీలకపాత్ర పోషించారని చెప్పారు. పోలీసు నిర్బంధాలను ఎదిరించారని, 24 మంది అమరవీరు లయ్యారని వివరించారు. పుచ్చలపల్లి సుందరయ్య, అట్లూరి స్ఫూర్తితో ఎన్నో ప్రజా ఉద్యమాలు సాగాయన్నారు. ఎర్రజెండా ఉద్యమాల స్ఫూర్తితో ప్రజా సంఘాలు కూడా అనేక పోరాటాలు చేశాయని, అందులో యుటిఎఫ్ కూడా ఒకటని అన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు

పతాకాల ఆవిష్కరణ

తొలుత మాజీ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని, యుటిఎఫ్ జిల్లా పూర్వ అధ్యక్షులు పి.రాందేవ్ ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని, జిల్లా పూర్వ సహాధ్యక్షులు దాసరి నవ భారతి సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వర్ణోత్సవ సావనీర్‌ను ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు కె.ఎ.ఉమా మహేశ్వరరావు, ఎస్‌పి మనోహర్ కుమార్, కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్ బాబు, జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, సుందరయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు



సిద్ధార్థ కళాశాలలో 'నో వెహికల్ డే'

ప్రజాశక్తి-కంకిపాడు : కానూరు విఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో నో వెహికల్ డే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రతినెల రెండవ శనివారం పర్యావరణ పరిరక్షణకు అందరూ ఒక రోజు మోటార్ సైకిల్, మోటార్ కార్ వినియోగాన్ని తగ్గించి పొల్యూషన్ నుండి సమాజాన్ని కాపాడాలని వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ఛాన్సర్ వెంకటేశ్వరరావు, ప్రో వైస్ ఛాన్సలర్ రత్న ప్రసాద్, సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ డాక్టర్‌చావా శ్రీనివాస్, మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





చిత్రలేఖనం పోటీల్లో 'కొమ్మారెడ్డి' విద్యార్థులు ప్రతిభ

ప్రజాశక్తి-బంటుమిల్లి : మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ, స్టార్ హెల్పింగ్ హబ్ సంయుక్త ఆధ్వర్యంలో సన్ స్టార్ స్కూల్, మచిలీపట్నంలో నిర్వహించిన డివిజన్ స్థాయి. చిత్రలేఖన పోటీలలో తమ విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచారని స్కూల్ డైరెక్టర్ శ్రీ కొమ్మారెడ్డి కిషోర్ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు పులి హేము శ్రీ 9వ తరగతి స్థాయిలో ప్రథమ స్థానం, అజ్మీరా రఘు రామ మహర్షి 8వ తరగతి స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మచిలీపట్నం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి శ్రీ బి.వి. శేఖర్ సింగ్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారన్నారు. అంతేకాకుండా తమ విద్యార్థులు ప్రత్తి తరుణీ పద్మావతి (9 వ తరగతి) సంబూరె గీతికా ప్రియ (8 తరగతి) లకు కన్సోలేషన్ సర్టిఫికెట్లను, బహుమతులను వచ్చాయన్నారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను సెక్రటరి అండ్ కరస్పాండెంట్ కె.యస్.వి.జి. శోభ , స్కూల్ ప్రధానోపాద్యాయులు ఎన్. శ్రీనివాసరావు, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు అభినందించారు.

రావి వెంకటేశ్వరరావు నియామకంపట్ల హర్షం



ప్రజాశక్తి - గుడివాడ : మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం నామినేటెడ్ పోస్టుల భర్తీలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో రావి నియామకం పట్ల టిడిపి శ్రేణులు ఆనందాలు వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్భంగా రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై ఉన్న నమ్మకంతో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా నియమించారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్పోరేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. గత 5ఏళ్ళు వైసిపి పాలనలో చేసిన అరాచకాలను ఎదిరించి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు న్యాయం చేస్తానన్నారు.

చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి : జడ్జి


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కె. శ్రీహరి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కె. శ్రీహరి అన్నారు.జాతీయ న్యాయ సేవల దినోత్సవం సంద ర్భంగా శనివారం మండలంలోని చాగంటిపాడు గ్రామంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కె .శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉయ్యూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, న్యాయవాదులు గ్రామస్తులకు న్యాయస్థానం పట్ల,చట్టాల పట్ల అవగాహన కలిగించారు. న్యాయమూర్తి శ్రీహరి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గమని, కేసులను లోక్ అదాలత్ ల ద్వారా పరిష్కారం చేసుకోవాలని తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


సురేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కొడమంచిలి మహేష్

ప్రజాశక్తి - పమిడిముక్కల : మండలంలోని పమిడి ముక్కల గ్రామంలో వైయ స్సార్ పార్టీ నాయకులు మన్నే సురేష్ కుటుంబాన్ని పమిడి ముక్కల మండల ఉపాధ్య క్షులు కొడమంచిలి మహేష్ శనివారం పరామర్శించారు. సురేష్ తండ్రి ఏలియా మృతి ఆయన కుటుంబానికి తీరని లోటు అని, కుటుంబ సభ్యులను పార్టీ నాయకులు ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బొల్లా రాంబాబు, ఎంపిటిసి గురివిందపల్లి వంశీ, ముల్లపూడి నాగార్జున, ఆనంద్, కొడాలి ఏసుపాదం తదితరులు పరామర్శించారు.

అనుమతి గోరంత... తవ్వేది కొండంత...

ప్రజాశక్తి - మైలవరం : పేరుకే దేవుని గట్టు... ఆ గట్టుకే రక్షణ లేకుండా పోయింది. గోరంత అనుమతితో కొండను తవ్వేస్తున్నారు. యథేచ్ఛగా గ్రావెల్‌ను రవాణా చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు.

మండలంలోని వెదురుబీడెం గ్రామంలో దేవుని గట్టు ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి కొంతమంది అక్రమార్కులు రాత్రి పగలు తేడా లేకుండా యదేచ్ఛగా గ్రావెల్‌ను రవాణా చేస్తున్నారు. అరకొర అనుమతులతో పొక్లెన్లు, టిప్పర్ల సహాయంతో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో టిప్పర్ గ్రావెల్‌ను మైలవరం మండల పరిధి గ్రామం అయితే 8 వేల నుండి రూ.10 వేల వరకు అమ్ముకుంటున్నారు.

విజయవాడ బైపాస్ నిర్మాణం పేరుతో...

గత ఏడాది నుండి విజయవాడ బైపాస్ నిర్మాణం పేరుతో అక్రమ గ్రావెల్ తోలకాలకు తెర తీశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అమరావతి రాజధాని పరిధిలోని రహదారుల నిర్మాణం వేగంగా సాగుతుంది. ఒక ప్రముఖ కంపెనీతో ఒప్పందం చేసుకొని సూరాయిపాలెం, అమరావతి, విజయవాడ తదితర ప్రాంతాల్లోని నిర్మాణాలతో పాటు ప్రైవేటు వెంచర్లకు మెరక చేసేందుకు పదివేల నుండి రూ.15 వేల వరకు టిప్పర్ గ్రావెల్‌ను రవాణా చేస్తున్నారు. యథేచ్ఛగా అక్రమంగా గ్రావెల్ రవాణా జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ, మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ రవాణాను నిరోధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



దేవుని గట్టు ప్రాంతంలో తవ్వుతున్న మట్టి

స్విమ్మింగ్ పోటీలకు పేట స్విమ్మర్లు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

మాస్టర్స్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఈ నెల 10న మున్సిపల్ స్విమ్మింగ్ పూల్ రాజమహేంద్రవరంలో నిర్వహించే 7వ స్టేట్ ఛాంపియన్షిప్ 2024 పోటీలో పాల్గొనేందుకు జిల్లా జగ్గయ్యపేట డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు 12 మంది, 1.కే. ఏసు మణి, 2. పి. లక్ష్మి, 3.ఏ. సీతారావమ్మ, 4.వై. భవాని, 5.వై ఉషారాణి, 6.పి రమ, 7.ఎస్ ఆదిలక్ష్మి, 8.కే. సరిత, 9.టీ. నాగమణి, 10.కె. జయ పావని, 11.ఆర్. నిహారిక, 12. ఏ పావని, 12 గురు పురుషులు 1. జి మోహన బాబు, 2.పి. పాండురంగారావు, 3.ఎస్ బి కే ఎస్ వర్మ, 4. ఎన్ ఎస్ వర్మ 5. వై రాంబాబు, 6. పి సందీప్, 7.కె యలమందరావు, 8. ఏ రమేష్ బాబు, 9.వై రామారావు, 10.జి శ్రీనివాసరావు, 11.కే శ్రీనివాస్, 12.వి.శ్రీనివాస్, మొత్తం 24 మంది స్విమ్మర్స్ శనివారం బయలుదేరారు. జట్టుకు కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు – లక్ష్మి ఆధ్వర్యంలో టీం మేనేజర్ అన్నం నీడి కళ్యాణ్ నాయకత్వం వహించారు. ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై విభాగాల్లో 400, 200, 100, 50 మీటర్లు వయసులవారీ కేటగిరుల్లో వీరు పోటీ పడనున్నారని డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మందడపు శ్రీనివాసరావు, జనరల్ సెక్రెటరీ కలాలి నరేష్ తెలిపారు.

విద్యుత్ సమస్యలపై ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలపై జగ్గయ్యపేట పట్టణంలో సబ్‌స్టేషన్ సమీపంలోని స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య శనివారం విద్యుత్ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ముఖ్యంగా జగ్గయ్యపేట కౌన్సిలర్స్ విద్యుత్ సమస్యలపై మాట్లాడారు. ముఖ్యంగా పట్టణంలో ఉన్న లో వోల్టేజ్ సమస్య, ఎప్పుడో పురాతనంగా వేసిన పాడైపోయిన కరెంటు పోల్స్, భ్రష్టు పట్టిపోయిన ఐరన్ పోల్స్ మార్చాలని కోరారు. పట్టణంలో ఉన్న లూజు లైన్లను కూడా సరి చేయాలని, ఓవర్ లోడ్ అయిన ట్రాన్స్ఫార్మర్లు ఉన్న దగ్గర కొత్త ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడారు. విద్యుత్ సమస్యలు తీర్చడంలో అధికారులు కష్టపడి పని చేయాలని, ముఖ్యంగా పట్టణంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. వసంతరావు, ఏడి శ్రీనివాసరావు, సెక్షన్ ఏఈలు, సబ్ ఇంజనీర్స్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు, పట్టణ తెలుగుదేశం పార్టీ సెక్రెటరీ మైనేని రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపోరు' పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి - ఏ. కొండూరు : 14 వరకు సిపిఎం ఆధ్వర్యంలో జరగనున్న ప్రజా సమస్యలపై పోరు యాత్ర వాల్ పోస్టర్లను ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం చీమలపాడు గ్రామంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు అదుపు చేయటంలో విఫలం చెందాయని, ప్రజల మీద భారాలు వేస్తూ, దేశ సంపదను అంబానీ, ఆధానీలకు దోచి పెడుతున్నాయన్నారు. రాష్టంలో కూటమి ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజల మీద 18 వేల కోట్ల రూపాయలు భారం వేస్తుందని, ఈ ధరల భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఈ నెల 14న ఎ.కొండూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నందిగామ : ప్రజా పోరు యాత్రలో భాగంగా నందిగామ 17,18 వార్డుల్లో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా పోరు పోస్టర్లు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నందిగామ కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడారు. సిపిఎం నందిగామ కమిటీ సభ్యులు, సయ్యద్ ఖాసిం, తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ : విద్యుత్ ట్రూఆఫ్ చార్జీల భారాలు నిరుద్యోగం, మహిళలు, మైనార్టీలు దళితులు గిరిజనులపై అత్యాచారాలు పెరుగుతున్నాయని సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు అన్నారు. ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా శనివారం వన్‌టౌన్ శంకర్ కెఫ్ సెంటర్‌లో ముఠా కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోయి సత్యబాబు పాల్గొని మాట్లాడుతూ ముఠా కార్మికులు, ఆటో కార్మికులు, హాకర్స్‌పై పోలీస్ ఫైనులు నిలుపుదల చేయాలన్నారు. రేషన్ డిపోలో నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలని, వరద బాధితులకు నష్టపరిహారాలు అందించాలి డిమాండ్ చేశారు. ఈ నెల 14వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయద్రం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పశ్చిమ నగర కమిటీ సభ్యులు జి. వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



ఏ. కొండూరులో...



వన్‌టౌన్‌లో...

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ స్వామి రామానంద సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో హెచ్‌ఐవి బాధిత పిల్లలకు నవంబర్ మాసానికి పౌష్టికాహారాన్ని శనివారం కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో అందజేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. ట్రస్ట్ ఈ సేవా కార్యక్రమాన్ని 29 మాసాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.6 వేల విలువైన ఆహార సామాగ్రిని బాలలకు అందజేస్తున్నామని అన్నారు. రాయపూడి వెంకటేశ్వరరావు, శ్రేయసు ప్రతినిధి రాజశేఖర్, లక్ష్మి, విజయ కుమారి, ట్రస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిపిఎం కొండపల్లి పట్టణ 8వ మహాసభ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి కామ్రేడ్ నండూరి ప్రసాద్ రావు భవన్ వద్ద శనివారం కొండపల్లి సిపిఎం 8వ మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎం కొండపల్లి పట్టణ ఎనిమిదో మహాసభలు క్రాంతి కాన్వెంట్‌లో ఆదివారం జరుగనున్నట్లు తెలిపారు. కరపత్రిక ఆవిష్కరణలో సీనియర్ నాయకులు ఎ.విఠల్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డివి కృష్ణ

సిపిఎం వత్సవాయి మండల కార్యదర్శిగా రాము

ప్రజాశక్తి - వత్సవాయి : పార్టీ కోసం ఎర్ర జెండా నీడలో చనిపోయిన వారిని మర్చిపోకూడదని సిపిఎం జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని మంగొల్లు గ్రామంలో వత్సవాయి మండలం ఐదో మహాసభ కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశం బి.రాము అధ్యక్షతన ఏర్పాటు చేశారు. పార్టీ జెండాను మాజీ ఎంపీపీ పల్లికంటి భాగ్యమ్మ ఎగరవేశారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి డివి.కృష్ణ పూల మాలలు వేసి నివాళు లర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిన్నమోలు సైదులు, జిల్లా సెక్రటేరియట్ మెంబర్ కోట కళ్యాణ్, సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, మండల కార్యదర్శి సోమోజి నాగమణి మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గంలో మండల కార్యదర్శిగా బి రాము, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా తమ్మినేని రమేష్, మండపూడి చంద్రశేఖర్, కనకపుడి పటేల్, సోమా రవి, ఎం సుందరయ్య, కంచర్ల కొండయ్య, కూరపాటి వెంకటి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లింగాల బ్రిడ్జిని నూతనంగా నిర్మించాలని, పోలంపల్లి దగ్గర డ్యాం మొత్తం గండ్ల పడిపోయాయని డ్యామును తర్వాత పూర్తి చేయాలని, అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకి నష్టపరిహారం అందించాలని, లింగాల పైలెట్ ప్రాజెక్టు నుండి మంచినీటిని పూర్తిస్థాయిలో అందించాలని తీర్మానం చేశారు.

ఇఒపిఆర్‌డి బాధ్యతలు స్వీకారం

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండలానికి ఎవో పి ఆర్ డి గా కెవి సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు బదిలీలో భాగంగా పెనుగంచిప్రోలు మండలానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు పలువురు ఉద్యోగులు కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

నేడు నీటి సంఘాల ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి - గంపలగూడెం : 2024–25 సంవత్సరానికి సంబంధించి, నీటి సంఘాల ఎన్నికల ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు గంపలగూడెం తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. మేజర్ ఇరిగేషన్ (ఎన్ఎస్పి)లో డబ్ల్యు యు ఎ–9కి గానూ 82 టిసిలు (టెరిటోరియల్ కానిస్టేట్ టుఎన్సి ఉండగా) ఉండగా, మైనర్ ఇరిగేషన్ టాంక్స్‌కు గానూ 15 డబ్ల్యూయుఎలో 90 టిసిలు ఉన్నట్లు చెప్పారు. భూ యజమానుల లిస్టులు ఫామ్ బిలో ఓటర్ల లిస్టు, ఫార్మ్‌డిల ద్వారా పబ్లికేషన్ చేయబడుతుందన్నారు. ఓటర్ లిస్టులో మార్పు చేర్పులు నవంబర్ 11,12 తేదీల్లో అర్జీలు దాఖలు చేసుకోవచ్చన్నారు. అర్జీలను ఆయా సచివాయాల్లో అందజేయాలని వివరించారు. ఫామ్ ఈ ద్వారా ఆప్షనల్ ఫర్ పర్టిక్యులర్ టి సి, ఫామ్ ఎఫ్ ద్వారా చేర్పులు, ఫామ్ జి ద్వారా నేమ్ అబ్జెక్షన్స్, ఫామ్ హెచ్ ద్వారా డిలీసన్స్ కొరకు అర్జీలు కోరుతున్నట్లు చెప్పారు. 13న ఫామ్‌ఐ ద్వారా ఫైనల్ ఎలక్టోరల్ రోల్ పబ్లికేషన్ విత్ ఫార్మ్ డి ద్వారా వెల్లడించనున్నట్లు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రూ.50 వేలు

ప్రజాశక్తి - గంపలగూడెం : నెమలి శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయ అభివృద్ధికి రూ.50వేలు వితరణగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య తెలిపారు. శని వారం ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామ వాస్తవ్యులు పెనుబోతు శేఖర్ వర్మ విజ య దుర్గ ఈ వితరణ అందజేసినట్లు చెప్పా రు. దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తల్లి జ్ఞాపకార్థం చలికోట్లు పంపిణీ

ప్రజాశక్తి - గంపలగూడెం : కనుమూరు గ్రామానికి చెందిన అత్తునూరు వెంకట శివారెడ్డి, రామిరెడ్డి తల్లి అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థం కాలానికి అనుగుణంగా వస్త్రాలు అందజేశారు. గ్రామంలో ఉన్న 100 మంది వృద్ధులు, వికలాంగులకు ఈ చలి కోట్లు శనివారం ఉదయం పంపిణీ చేశారు. సర్పంచ్ మందమారేశ్వరి, వైసిపి నాయకులు చెరుకు నరసారెడ్డి అందజేసిన వారిలో ఉన్నారు.

వనజాక్షికి నివాళి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ఎన్‌డిఎ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తల్లి వనజాక్షి ఇటీవల కాలంలో మృతి చెందారు. శనివారం ఏలూరు జిల్లా పెదవేగి మండలం లక్ష్మీపురం తోటలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ తో కలిసి వనజాక్షి చిత్రపటానికి టిడిపి జిల్లా నెట్టెం శ్రీరఘురామ్ నివాళులర్పించారు.

రూ.5లక్షలు విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, కోకా పేట, హైదరాబాద్‌కు చెందిన తుమ్మల శ్రీనివాస్ సంపత్ శ్రీ అమ్మవారి దేవస్థానం నందు జరుగు అన్నదానం నిమిత్తం తుమ్మల శ్రీనివాస్ సంపత్, శ్రీ దుర్గ పేరున అన్నదానం నిర్వహించేందుకు గానూ ఆలయ ఇఒ కెఎస్.రామారావుని శనివారం కలిసి రూ. 5 లక్షల చెక్కు రూపంలో విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఎమ్. రత్న రాజు ఉన్నారు.. అనంతరం వీరికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, వేదపండితులచే వేదార్వచనం కల్పించగా ఈవో అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం మరియు చిత్రపటం అందజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : అక్రమంగా ఇబ్రహీంపట్నం ప్రసాద్ నగర్ లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పోలీస్ అధికారులు పట్టుకున్నారు. పట్టుకున్న రేషన్ బియ్యం సుమారుగా 500 కేజీలు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ ముద్రతో ఉన్న సంచులను అక్రమార్కులు నిల్వ చేశారు. రేషన్ డిపో, పంపిణీ వాహన దారులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఖాళీ ప్రదేశంలో బియ్యం నిల్వలు చేసిన వారికోసం పోలీసులు గాలిస్తున్నారు.

యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు : మంత్రి



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్ర పుణ్యస్నానాలు ఆచరించుటకు యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పుణ్యస్నానాలు ప్రశాంతంగా జరిగేలా పటిష్టవంతమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. మంత్రి శనివారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గహంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా చేయవలసిన ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 15వ తేదీ శుక్రవారం తెల్లవారుజాము నుండి మంగినపూడి బీచ్ వద్ద సముద్ర పుణ్యస్నానాలు ఆచరించుటకు లక్షలాదిమంది భక్తులు వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా బీచ్ వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా బస్సులు, ఆటోలు, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ లకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలని, వాటికి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. బీచ్ వద్ద శివాలయం దత్తాశ్రమం వద్ద కూడా ఏర్పాట్లు చేయాలన్నారు. బీచ్ వద్ద అవసరమైన లైటింగ్, బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని, పుణ్యస్నానాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా మత్స్యశాఖ అవసరమైన పడవలు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ఈనెల 11 నుండి పాండురంగ ఉత్సవాలు మొదలవుతాయని, 13న రథోత్సవం జరుగుతుందని, ఈ కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు, ఆర్డీవో కె. స్వాతి, డిపిఓ జే అరుణ, డీఎస్పీ ఎండి అబ్దుల్ సుభాని,జిల్లా ప్రజా రవాణా అధికారి వాణిశ్రీ, ఐసిడిఎస్ పిడి ఎస్ సువర్ణ, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - నందివాడ (గుడివాడ) : సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వలన జరిగే అనర్థాలు, ట్రాఫిక్ నియమాలపై అలాగే డయల్ 100/112 సేవల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నందివాడ ఎస్ఐ కె శ్రీనివాసు పేర్కొన్నారు. కుదరవల్లి గ్రామంలో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసు మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు, వారి వ్యవహారశైలిని గుర్తించడం అలాగే స్వీయ రక్షణ గురించి అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు కలిగి ఉండాలని పిల్లలు స్మార్ట్ ఫోన్లలో, సోషల్ మీడియా వినియోగిస్తున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తప్పక తెలుసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల ఉపయోగం వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలను వివరించి, విద్యార్థులకు ఎలాంటి అనారోగ్యకర ద్రవ్యాల వాడకానికి పాల్పడకూడదని సూచించారు. ఏదైనా అత్యవసర సమయంలో పోలీసు వారి సహాయం పొందాలి అంటే అటువంటి సమయంలో డయల్ - 100/112 కు కాల్ చేయడం ద్వారా సమీపంలోని పోలీస్ స్టేషన్ సిబ్బంది నుండి సత్వర సహాయం అందుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి అందరూ సహకరించాలని జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు ముదావత్ ఎం నాయక్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శనివారం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు, రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివద్ధి, మత్స్యశాఖ కార్యదర్శి ఎం ఎం నాయక్ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మలతో కలసి ఓటర్ల జాబితా తయారీపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్ల జాబితా కీలకమని అది పటిష్టంగా ఉన్నప్పుడే ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా జరుగుతాయన్నారు. ముఖ్యంగా ఓటర్ల జాబితాలో మృతి చెందిన ఓటర్లను, శాశ్వతంగా వలస పోయిన ఓటర్లను తొలగించి సరైన జాబితాను తయారు చేయవలసి ఉంటుందన్నారు. ఓటర్ల జాబితాలో ఫోటోలు నాణ్యత పరంగా బాగుండాలన్నారు. ఇందుకోసం బాగా కనిపిస్తున్న ఫోటోలను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఒక ఓటరుకు ఒక ఓటు మాత్రమే ఉండాలని రెండో ఓటు (డూప్లికేట్) లేకుండా తీసేయాలని సూచించారు. ఈనెల 9, 10, 23, 24 తేదీలలో శని,ఆదివారాలలో ఓటరు నమోదు, చేర్పులు, మార్పుల కోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి బిఎల్ వో ల ద్వారా దరఖాస్తులు స్వీకరించే విషయమై విస్తతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, ఇన్చార్జి డిఆర్ఓ శ్రీదేవి, మచిలీపట్నం, గుడివాడ, పెనమలూరు, పామర్రు, గన్నవరం నియోజకవర్గాల ఈఆర్ఓలు కే స్వాతి, జి బాలసుబ్రమణ్యం, బిఎస్.హేచ్. షారోన్, జి రమేష్ బాబు, షాహిద్ బాబు పాల్గొన్నారు.

'ప్రజాపోరు' కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : దేశవ్యాప్త పిలుపులో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజాపోరు కరపత్రాలను శనివారం పంపిణీ చేశారు. సిపిఎం సానుభూతి పరులు హరిజనవాడ, కొండిపాలెం, నక్కలపాలెం, రెడ్డిపాలెం, వులవపూడి తదితర చోట్ల పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం గుడ్లవల్లేరు భాద్యులు బి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధి 200 రోజులకు పెంచి 600కూలీ చెయ్యాలని, పట్టణాల్లో కూడా ఉపాధి హామీ పథకం కేరళ తరహాలో ప్రవేశపెట్టాలని, కేంద్ర నిరంకుసత్వాన్ని రుద్దే జమిలి ఎన్నికలను రద్దు చేయాలని పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. నిత్యావసర సరుకులు 15 రకాలు రేషన్ ద్వారా తక్కువ రేట్లకు ఇవ్వలని, అధిక ధరలను అదుపు చేయాలని ,ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని ,విశాఖ స్టీల్ ప్రవేటీకారణ దొడ్డి దోవన చేసే ప్రయత్నాలు కూటమి పార్టీలు అడ్డుకుంటామని స్పష్టంగా ప్రకటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సానుబూతి పరులు కటికల యాకోబు,కటికల కొండయ్య , మెడేపల్లి రాంబాబు, జంగం సాగర్, మన్నేపల్లి నాగరాజు, పరిసిపోగు ప్రభు దాస్, కోండెపాలెం లో మోదుగుమూడి రేణుకారాజు ,రెడ్డిపాలెం లో పామర్తి రమాదేవి,పామర్తి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉత్సాహంగా హార్స్ రైడింగ్

ప్రజాశక్తి-గన్నవరం : స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో శనివారం నిర్వహించిన హర్డిల్ హార్స్ రైడింగ్ ఆకట్టుకుంది. ఎన్సీసీ క్యాడెట్లు గుర్రపు స్వారీ చేస్తూ సాహెూసేపేతమైన విన్యాసాలు చేశారు. వీరిలో ఉత్తమ రైడర్లుగా నిలిచిన ఎన్సీసీ క్యాడెట్లకు కాకినాడ ఎన్సీసీ హెడ్ క్వార్టర్ గ్రూపు కమాండర్ కల్నల్ ఆర్ఎం. అగర్వాల్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్సీసీ శిక్షణ పొందిన క్యాడెట్ల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. హర్స్ రైడింగ్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఎన్ సీసీ క్యాడెట్లను హైదరాబాద్లో జరిగే ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్కు అర్హత సాధించినట్లు తెలిపారు. అక్కడ క్యాంప్ లో సెలక్ట్ అయిన ఏపీ, తెలంగాణకు చెందిన క్యాడెట్లను న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పేరడ్లో ప్రదర్శన చేసే అవకాశం లభిస్తుందన్నారు. క్యాంప్ కమాండెంట్ రాట్టి, కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ తీర్థప్రసాద్, అసోసియేట్ ఎన్సీసీ ఆఫీసర్ డాక్టర్ ఎల్. జయబాల్, ఏఎన్ఐ లెఫ్టినెంట్ ఎండీ. నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యాయానికి 'స్వచ్ఛ సుందర చల్లపల్లి' దోహదం

ప్రజాశకి- చల్లపల్లి : స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో నూతన అధ్యాయానికి దోహద పడిందని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం చేపట్టి పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం గ్రామంలో వేడుకలు ఘనంగా జరిగాయి. స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీ.ఆర్.కే.ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి ఆధ్వర్యంలో గంగులవారిపాలెం దారిలో హైవే వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛ సుందర చల్లపల్లి బోర్డు, నూతనంగా నిర్మించిన స్వాగత మార్గాన్ని అతిథులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్.ఆర్.వై.ఎస్పీ జూనియర్ కళాశాల వద్ద నుంచి చల్లపల్లి గ్రామపంచాయతీ వరకు భారీ పాదయాత్ర, మానవహారం నిర్వహించారు. దారి పొడవునా డప్పు వాయిద్యాల నడుమ స్వచ్ఛ కార్యకర్తల, కళాకారుల ఆటపాటలతో సందడిగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా స్వగహ హాలులో దశాబ్ద కాలపు స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తల నిర్విరామ కృషి సమీక్ష సభ జరిగింది. డాక్టర్ డీ.ఆర్.కే.ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి దంపతులు మాట్లాడుతూ స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం నిర్వహణలో తమకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదములు తెలిపారు.

విరాళాలు అందజేత : స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం నిర్వహణకు ప్రముఖ వైద్యులు డాక్టర్ దుగ్గిరాల శివప్రసాద్ రూ.2లక్షలు, డాక్టర్ మాలెంపాటి గోపాలకష్ణయ్య రూ.25వేలు, ఘంటా హేమలత రూ.25వేలు, తుళ్ళూరి లక్ష్మీ నరసింహారావు రూ.10వేలు, ప్రాతూరి శాస్త్రి రూ.10 వేలు, ఉడత్తు వెంకటేశ్వరరావు రూ.10వేలు, వడ్డీ బ్రహ్మేశ్వరరావు రూ.5వేలు విరాళం అందచేశారు. ఈ కార్యక్రమంలో శాంతా బయోటెక్ చైర్మన్ డాక్టర్ కె.వరప్రసాదరెడ్డి, కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ఏవీ గురవారెడ్డి ఎన్ఆర్ఐ, మారథాన్ రన్నర్ నాదెళ్ల సురేష్, స్వచ్ఛ చల్లపల్లి సలహాదారు ఉదయ్ సింగ్ గౌతమ్, దాసరి వెంకటరమణ (చిన్నాజీ), డాక్టర్ ముత్యాల వరప్రసాద్, ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, మాజీ ఏఎంసీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్ఎ యార్లగడ్డకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం : : విదేశీ పర్యటన ముగించుకుని శనివారం గన్నవరం విమానా శ్రయానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేరుకున్నారు. గన్నవరం నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు విమానాశ్రయానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి ఘంటసాల : ఘంటసాలలోని యూవీ ఆర్ గొర్రెపాటి స్కూల్లో ఆంధ్రా హాస్పిటల్ మచిలీ పట్టణం వారిచే శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ బోలెం తేజా నవీన్ (దేవరకోట), డాక్టర్ బి.పద్మ, డాక్టర్ బాణావతు భాను ప్రకాష్, బందరు ఆంధ్రా హాస్పిటల్ హాస్పిటల్ నిర్వాహకులు ఎమ్.శివరామ కష్ణ ప్రసాద్ను గ్రామం తరుపున కతజ్ఞతలు తెలియచేసి పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూవీఆర్ గొర్రెపాటి స్కూల్ ప్రిన్సిపల్ లోయి నాగేశ్వర రావు, గొర్రెపాటి ట్రస్ట్ ప్రతినిధి కొండపల్లి వెంకట రామకష్ణ, ఆంధ్రా హాస్పిటల్ సిబ్బంది, స్కూల్ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు .

శ్రీకాకుళేశ్వరుని సేవలో సింహాద్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో ఉన్న శ్రీకాకుళేశ్వర స్వామివారిని వైఎస్సార్సీపీ నేత డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించిన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ అవనిగడ్డ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం వైఎస్సార్సీపీ నేతలు తిరుమలశెట్టి రాంబాబు, కొండవీటి కిషోర్, తుంగల ముసలయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రారంభం హర్షణీయం



ప్రజాశక్తి-కంకిపాడు : విజయ వాడ-మచిలీపట్నం జాతీయ రహ దారిపై ట్రాఫిక్ ఇక్కట్లకు చెక్ పెట్టేందుకు బందరు రోడ్డుకు సమాం తరంగా నిర్మించిన పంట కాలువ రోడ్డును పూర్తి స్థాయిలో అందు బాటులోకి తెచ్చిన స్థానిక శాసనసభ్యులు బోడె ప్రసాద్ అభినందనీయులని కంకిపాడు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్ అన్నారు. పంట కాలువ రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత తెదేపా హయంలోనే 90 శాతం పైగా సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలోని పై వంతెన పనులు పూర్తయినప్పటికీ, కేవలం అప్రోచ్ రోడ్లను నిర్మించడంలో వైకాపా ప్రభుత్వం విఫలమయిందన్నారు. బోడె ప్రసాద్ తిరిగి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఐదు నెలల స్వల్ప వ్యవధిలోనే పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారని ప్రశంసించారు

ప్రాంతీయ పరిశ్రమల అభివృద్ధికి సహకారం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : ప్రాంతీయ పరిశ్రమ అభివృద్ధికి మరొక ముఖ్యమైన అడుగు పడిందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితేష్ రంజన్ అన్నారు. శనివారం మచిలీపట్నం మండలం లోని పోతేపల్లి గ్రామం జ్యువలరీ పార్కులో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మచిలీపట్నం ప్రాంతం ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ క్లస్టర్ అవుట్ రీచ్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన బ్యాంక్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలు (మైక్రో, స్మాల్, అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్) అభివద్ధికి మద్దతునందించేలా ప్రముఖులు, వ్యాపారవేత్తలు, పరిధి వ్యాపార వేత్తలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో విజయవంత మైందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జోనల్ హెడ్ సి వి ఎన్ భాస్కర్ రావు, రీజినల్ హెడ్ వెంకటరావు, జనరల్ మేనేజర్ వేమూ రూ చంద్రమౌళి, ఆర్ వెంకట్రావు, అంకెం జితేంద్ర,పీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి - మైలవరం : నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని అప్స డెమోక్రటిక్ మైలవరం నియోజకవర్గస్థాయి ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులకు ఆటల పోటీలు శనివారం స్థానిక ఎస్‌ఎస్‌కె ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో 15 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు అప్స డెమొక్రటిక్ వ్యవస్థాపక అధ్యక్షులు గొల్లపూడి మోహన్‌రావు తెలిపారు. సీనియర్, జూనియర్, జూనియర్ విభాగాల్లో బాల బాలికలకు కోకో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, త్రో బాల్, రన్నింగ్, షార్ట్ పుట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు మోహన్‌రావు పేర్కొన్నారు. అప్సా జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్ రెడ్డి, ఎం.శ్రీనివాసరావు, ఈ రాజారెడ్డి, సురేష్, రాధాకృష్ణారెడ్డి, చక్రధర్, కిరణ్ కుమార్ వివిధ పాఠశాలలకు చెందిన కరెస్పాండెంట్‌లు, ప్రిన్సిపాల్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి మహిళ మృతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లిలోని మాత నర్సింగ్ హోమ్‌లో వైద్యుడు చేసిన ఆపరేషన్ వికటించడంతో వివాహిత మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. బంధువుల కథనం ప్రకారం చందర్లపాడు మండలం కాండ్రపాడు గ్రామానికి చెందిన దూలం మాధవి గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ మాత నర్సింగ్ హెూమ్ కొండపల్లిలో చికిత్స తీసుకుంటుంది. స్కానింగ్ రిపోర్టు ఆధారంగా కడుపులో కణితి ఉండటం వల్ల శస్త్ర చికిత్సకు సిఫార్సు చేసి, తన దగ్గర సరైన వైద్య సదుపాయాలు లేకపోయినా వైద్యుడు సర్జరీకి ప్లాన్ చేశాడు. ఆపరేషన్ మధ్యలో బాధితురాలు స్పృహ కోల్పోయి ప్రాణపాయ స్థితిలోకి వెళ్లడం గమనించి, అత్యవసర కేసుగా హడావిడి చేసి ఆంధ్ర హాస్పిటల్‌కి హుటాహుటిన తరలించాలని సదరు వైద్యుడు సూచించారు. ఆంధ్ర హాస్పిటల్‌కు వెళ్లే మార్గమధ్యంలోనే మహిళ మృతిచెందింది. బాధిత కుటుంబాలు ఇబ్రహీంపట్నం పోలీసు వారిని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఇండియన్ మెడికల్ కౌన్సిల్‌కి సిఫారసు చేసి తన వైద్య వృత్తి లైసెన్స్ రద్దు చేయాలని యువతి తాలూక కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు మార్చాలి

50 వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు


విద్యుత్ వైర్లను సత్యబాబుకు చూపుతున్న స్థానిక మహిళ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజక వర్గంలోని 50వ డివిజన్‌లో ప్రమాద కరంగా ఉన్న విద్యుత్ వైర్లను మార్చాలని సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు విజ్ఞప్తి చేశారు. శనివారం కార్పొరేటర్ సత్యబాబు గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో పర్యటించారు. గొల్లపాలెం గట్టు జెండా చెట్టు ఏరియా ఇళ్ళ మధ్యలో ఉన్న విద్యుత్ వైర్లు మార్చి ప్రమాదాలు నివారించాలని కోరారు. ఈ విషయమై పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదులు చేసినా, వినతి పత్రాలు ఇచ్చిన సంబంధిత అధికారులు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్తు డిఇ స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై ఈనెల 14వ తేదీ ప్రజా పోరు కార్యక్రమం ద్వారా కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాకు ప్రజలందరిని కలుపుకొని కలెక్టర్‌కి వినతి పత్రాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఎం నాయకులు పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

గొలుసు దొంగల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - తిరువూరు : ఒంటరిగా వెళ్ళే మహిళలను లక్ష్యంగా చేసుకుని మెడలో గొలుసు లాకెళ్ళుతున్న చైన్‌స్నాచర్ల పట్ల అప్రమత్తం ఉండాలని ఎస్ఐ సత్యనారాయణ తిరువూరు మండలం కాకర్ల గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం ఆయన సైబర్ నేరాలకు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముసుగు ధరించి బైక్‌పై వస్తూ మెడలో గొలుసు లాకెళ్తున్న ధైర్యంగా ఎదుర్కొని పోసులకు వెంటనే సమాచారమివ్వాలని సూచించారు. గ్రామాల్లో వ్యాపారాల పేర్లతో వచ్చేవారికి ఆధార్ నెంబర్లు సమాచారాన్ని ఇవ్వద్దని చెప్పారు. తెలిసిన వ్యక్తుల కే తప్ప తెలియని వారికి ఏ విధమైన సమా చారం ఇవ్వద్దని విజ్ఞప్తి చేశారు.

కానరాని సిసిఐ కేంద్రాలు

రైతు రాజ్యం...రైతు శ్రేయస్సే తమ ధ్యేయం అంటూ నిత్యం కూటమి ప్రభుత్వం వల్లెవేస్తోంది. కానీ ఆచరణలో మాత్రం రైతు వెన్ను విరిచే చర్యలకు పూనుకుంది. తమను గత ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసిందని కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్న రైతులకు ఐదు మాసాలు కాక ముందే... గత ప్రభుత్వం దారిలోనే ఈ ప్రభుత్వం కూడా పయనిస్తుందని రైతులు మండి పడుతున్నారు. గ్రామాల్లో పత్తి అమ్మకాలు-కొనుగోలు సీజన్ వచ్చింది. ఒక వైపున పంట దిగుబడి తగ్గిపోతూ... పెట్టుబడులు పెరిగిపోయి, మద్దతు ధర అందుబాటులో లేక...ప్రయివేటు వ్యాపారుల మోసాలకు గురౌతూ పత్తి రైతులు పెద్ద మొత్తంలో నష్టపోతున్నారు. జిల్లాలో పలు మండలాల పరిధిలో పత్తి తీతలు జరుగుతున్నాయి. కానీ మార్కెట్ యార్డుల్లో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఇంకా ప్రారంభించ లేదు. ఒకటి, అర చోట కేంద్రాలను ప్రారంభించినా పత్తి కొనుగోలు మాత్రం మొక్కుబడిగా జరుగుతుంది. ప్రస్తుత ఈ ఖరీఫ్ సీజన్‌లో పత్తి రూ.7,520 క్వింటాకు మద్దతు ధరగా నిర్ణయించారు. సిసిఐ కొనుగోలుకు ముందుకు రాకపోతుండటంతో బహిరంగ మార్కెట్‌లో కేవలం రూ. 5,200 నుంచి 5,500 లోపే వ్యాపారులకు రైతులు అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో క్వింటాకు రెండు వేలకు పైగా ప్రతి రైతు నష్టపోతున్నాడు. వాతావరణం అనుకూలించి అన్నీ సజావుగా ఉంటే ఎకరానికి 15 క్వింటాళ్ల నుంచి18 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి అయ్యేది. కానీ ఈ ఏడాది సంభవించిన వరదలు, చీడపీడల వలన కేవలం ఎకరానికి ఐదు క్వింటాళ్లలోపు మాత్రమే పత్తి దిగుబడి ఉంటుందని రైతులు వివరిస్తున్నారు. ఎకరానికి కనీసం రూ.35 వేలు ఖర్చు అవుతుంది. పెట్టిన పెట్టుబడులు, బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలు పరిశీలిస్తే ఎకరానికి రూ.పది వేలు నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. తిరువూరు, మైలవరం మార్కెట్ యార్డుల్లో సిసిఐ కేంద్రాలు ప్రారంభించినప్పటికీ పూర్తి స్థాయిలో పత్తి కొనుగోలు జరగడం లేదు.ఈ ఏడాది పత్తి పంట జిల్లాలో సుమారు



80 వేల ఎకరాల్లో సాగు చేశారు. గంపలగూడెం, మైలవరం, వత్సవాయి, చందర్లపాడు, నందిగామ, తిరువూరు, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, వీరులపాడు, కంచికచర్ల, జి కొండూరు, ఎ.కొండూరు మండలంలో కొన్నిగ్రామాల్లో ఈ ఏడాది విస్తృతంగా పత్తి సాగు చేశారు. ప్రస్తుతం వరకు ఒక్కొక్క ఎకరానికి రెండు,మూడు క్వింటాళ్ల పత్తి చేతికొచ్చినట్లు రైతులు వివరిస్తున్నారు. గత అక్టోబర్ 15 నుంచి అడపాదడపా గ్రామాల్లో పత్తిని తీస్తున్నారు. ఈ పత్తిని కూడా కొనుగోలు చేసే పరిస్థితి ప్రభుత్వాల వద్ద లేకుండా పోయింది. దీంతో అనివార్యంగా ప్రయివేటు వ్యాపారులకు అతి తక్కువకు రైతులు విక్రయించుకోవాల్సి వస్తోంది. మార్కెట్ యార్డుల్లో సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి పత్తిని మొత్తాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అంతేగాక అంతర్జాతీయ మార్కెట్‌లో క్వింటా పత్తి రూ. 12 వేలు ఉండగా, ఇక్కడ మాత్రం రూ. 7,520 మాత్రమే ఉందని, దీని వల్ల ప్రస్తుతం రైతులకు గిట్టుబాటు కాదని, కనీసంగా క్వింటా రూ. పది వేలకు కొనుగోలు చేసినట్లయితే...ఎకరానికి ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చినా...పెట్టుబడులు పోనూ ఎంతో కొంత మిగులుతుందని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అలాగే జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. రెడ్డిగూడెం, ఇతర ప్రాంతాల్లో రైతులు వరి కోతలు ప్రారంభించారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం రైతులకిచ్చినట్లుగా ఈ కూటమి ప్రభుత్వం ఎకరానికి రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా నేటికీ ఏ ఒక్క రైతుకు డబ్బులు మంజూరు చేయలేదని, కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని వారు వ్యక్తం చేస్తున్నారు.

వి.హెచ్.ఆర్

వసుంధర డైమండ్ రూఫ్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వసుంధర డైమండ్ రూఫ్ షోరూం 9వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఎం.జి.రోడ్డులో గల షోరూంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లడుతూ కేవలం వ్యాపార దృష్టితోనే కాకుండా సామాజిక దృక్పథంతో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. 9వ వార్షికోత్సవం జరుపుకున్నందుకు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ వసుంధర మాట్లాడుతూ తమ సంస్థ హైదరాబాద్‌లో ప్రారంభించి 27 సంవత్సరాలు అయిందన్నారు. అప్పటి నుండి వినియోగదారుల ఆదరాభిమానాలు పొందుతుందన్నారు. అపూర్వమైన డిజైన్లకు, నాణ్యతకు, వినియోగదారుల సంతృప్తిని వసుంధర డైమండ్ రూఫ్‌కు ఒక ప్రత్యేకత ఉందని అన్నారు. విజయవాడ షోరూంలో మూడు రోజులపాటు ఆభరణాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎగ్జిబిషన్ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నన్నపనేని రాజకుమారి, గద్దె అనురాధ, తదితర నగర ప్రముఖులు పాల్గొన్నారు.



వేడుకలు ప్రారంభిస్తున్న అనిత, అనురాధ, నన్నపనేని రాజకుమారి

రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : క్రీడాకారుడు నాయకుడైతే అభివృద్ధి వైపు పరుగులు అని విజయవాడ తూర్పు నియోజక వర్గ శాసన సభ్యులు గద్దే రామ్మోహన్ అన్నారు. 68వ పాఠశాల క్రీడా సమాఖ్య అండర్ 17 బాల, బాలికల రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలను పటమట బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన అనంతరం అయన మాట్లాడారు. సభకు జిల్లా విద్యా శాఖధికారి యు.వి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. గద్దే తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ క్రీడలు ఐక్యతను, స్నేహాతత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రకటించిన 'స్పోర్ట్స్ ఫర్ ఆల్' క్రీడా పాలసీ క్రీడాకారుల పాలిట వరం అని రామ్మోహన్ తెలిపారు. తొలుత గద్దే క్రీడా జ్యోతి వెలిగించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్, మాజీ శాసన సభ్యులు యలమంచిలి రవి మాట్లాడుతూ క్రమ శిక్షణ తో పోటీలలో పాల్గొని పతకాలతో తిరిగి వెళ్ళాలని అన్నారు. జిల్లా విద్యా శాఖధికారి సుబ్బారావు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులను చదువుతో పాటు క్రీడలలో రాణించేలా పాఠశాల లో క్రీడామైదానాలను సంసిద్ధం చేసినట్లు తెలిపారు. లైన్స్ క్లబ్ గవర్నర్ శేషగిరిరావు మాట్లాడుతూ స్పోర్ట్స్ కోటా ప్రభుత్వం 3శాతం పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పోటీల కార్యనిర్వాహక అధ్యక్ష, కార్యదర్శులు ఎస్తేరు రాణి, యల్. దుర్గారావు అతిధులను స్వాగతం పలికారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుండి షుమారు 250మంది క్రీడాకారులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు హాజరయ్యారు. రుచికరమైన భోజనాన్ని, వసతి కార్యనిర్వాహక కమిటీ ఏర్పాటు చేసింది.రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య నుండి కె.వి.రాధాకృష్ణ, ఎపి.రాజు, సత్యప్రసాద్, శ్రీలత, వర్మ, వ్యాయామ విద్య సహాయకులు ధనియాల నాగరాజు, మార్త, సురేంద్ర, మార్తమ్మ, రిజ్వానా, రూతమ్మ, రమణ కుమారి, శేషగిరి, రాజశేఖర్, చంద్ర శేఖర నాయుడు, రాంబాబు, గీత, రాజ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు గోపాల కృష్ణ, లాలా మధు తదితరులు హాజరయ్యారు.


హ్యాండ్ బాల్ పోటీలు జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గద్దె, తదితరులు

రాష్ట్ర అండర్ -14 వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - భోగాపురం (విజయనగరం జిల్లా)

స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. విజయనగరం జిల్లా భోగాపురం జడ్పి ఉన్నత పాఠశాల మైదానంలో ఈ పోటీలను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఘనంగా ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా 26 బాల బాలికల జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐపిఇ జి.భానుమూర్తి రాజు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ అంబేద్కర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడాజ్యోతిని వెలిగించారు. క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అన్ని జిల్లాల క్రీడాకారులు నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్ అందరినీ ఆకట్టుకుంది. పోటీలకు హాజరైన బాల బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భోగాపురం కేజీబీవీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది.


క్రీడా జ్యోతిని వెలిగించిన కలెక్టర్ అంబేద్కర్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ఉమ్మడి కృష్ణాజిల్లా క్రీడాకారులు